



చిలకలూరిపేట మేజర్ కాలువ ప్రాంతం విస్తరణ

మహా ఏర్పాట్లు

- తిరునాళ్లకు శరవేగంగా పనులు
- ఉచిత, శీఘ్ర, ప్రత్యేక దర్శనాలకు క్యూలు
- కోటప్పకొండలో రేపటి నుంచి ఉత్సవాలు ప్రారంభం
- కోటయ్య స్వామికి విశేష అభిషేకాలు..
- తరలిరానున్న భక్తులు



కోటప్పకొండ(నరసరావుపేట), ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మహా శివరాత్రి పండుగ సందర్భంగా ప్రముఖ శైవక్షేత్రం కోటప్ప కొండ శ్రీత్రికోటేశ్వరస్వామి సన్నిధిలో 26న బుధవారం జరిగే తిరునాళ్లకు విస్తృత ఏర్పాట్లు జరుగుతున్నాయి. కోటయ్య క్షేత్రం లో పనులు శరవేగంగా జరుగుతున్నాయి. దేశ ప్రసిద్ధి చెందిన తిరునాళ్లకు లక్షలాదిగా తరలివచ్చే భక్తుల కోసం ప్రత్యేకంగా ఏర్పాట్లు చేస్తున్నారు. శ్రీత్రికోటేశ్వరస్వామి దర్శనం కోసం ఉచిత, శీఘ్ర, ప్రత్యేక దర్శనాలకు క్యూలు ఏర్పాటు చేశారు. వీఐపీలు, ప్రొటోకాల్ వీఐపీల కోసం వేర్వేరుగా క్యూలు ఏర్పాటు చేస్తున్నారు. క్యూలను తాటాకు పందిళ్లతో నిర్మిస్తున్నారు. తిరునాళ్లకు వచ్చే భక్తుల కోసం స్వామి వారి ప్రసాదాన్ని సిద్ధం చేస్తున్నారు. రెండు లక్షల లడ్లు, లక్ష అరిసెలను భక్తులకు అందుబాటులో ఉంచనున్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ ఆధ్వర్యంలో తాగునీటి సరఫరా, తాత్కాలిక మరుగుదొడ్ల నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఆర్‌అండ్‌బీ, విద్యుత్ విభాగం ఆధ్వర్యంలో కొండ ప్రాంతం వద్ద ఫ్లడ్‌లైట్లు ఏర్పాటు చేస్తున్నారు. ట్రాన్స్‌ఫార్మర్లను, జనరేటర్లను ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా విద్యుత్ శాఖ ప్రత్యేకంగా చర్యలు తీసుకుంటున్నది. భక్తులు తలనీలాలు సమర్పించేందుకు కొండ దిగువున ఏర్పాట్లు చేస్తున్నారు. చిలకలూరిపేట మేజర్ వద్ద స్నాన ఘట్టాలను ఏర్పాటు చేస్తున్నారు. పాత కోటేశ్వరస్వామి దేవాలయం వద్ద విద్యుత్ ఏర్పాట్లు జరుగుతున్నాయి. దేవస్థానం వద్ద ఏర్పాట్లను ఈవో చంద్రశేఖరరావు పర్యవేక్షిస్తున్నారు. భక్తులు పర్యాటక కేంద్రాన్ని సందర్శించేలా అటవీశాఖ ఏర్పాట్లు చేస్తున్నది. ఆనందం, ఆహ్లాదం కోసం కొండ దిగువున ఎమ్యూజ్‌మెంట్ పార్కు రూపు దిద్దుకుంటున్నది. వైద్య ఆరోగ్య శాఖ వైద్య శిబిరాల ఏర్పాట్లలో నిమగ్నమైంది. పోలీసు అధికారులు బందోబస్తుకు అవసరమైన చర్యలు తీసుకుంటు న్నారు. వాహనాల రాకపోక లకు ఇబ్బంది లేకుండా చిలక లూరిపేట మేజర్ కాల్వ, నరసరావు పేట రహదారి మధ్యలో ఉన్న ప్రాం తా న్ని విస్తరించారు. ఆయా పనులను ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు శనివారం పరిశీలించారు.

రేపు ఏకాదశికి ప్రత్యేక ఏర్పాట్లు

త్రికోటేశ్వరస్వామి తిరునాళ్ల ఉత్సవాలు సోమవారం ఏకాదశి నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ సందర్భంగా దేవస్థానంలో కోటయ్యస్వామికి విశేష అభిషేకాలు నిర్వహించనున్నారు. వేలాదిగా కొండకు భక్తులు తరలిరానున్నారు. మూలవిరాట్ అభిషేకాలకు భక్తులను అనుమతించడంలేదు. అభిషేక మండపంలో స్వామికి అభిషేకాలు చేసేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ అభిషేకాలకు రూ.500 టికెట్‌పై ఇద్దరిని అనుమతిస్తారు.



దేవస్థానం వద్ద క్యూల నిర్మాణం



లడ్డూ ప్రసాదం తయారీ

తిరునాళ్లకు 550 ఆర్టీసీ సర్వీసులు

తిరునాళ్ల రోజున నరసరావుపేట, చిలకలూరిపేట డిపోల నుంచి ప్రత్యేకంగా బస్సులను ఆర్టీసీ ఏర్పాటు చేసింది. చిలకలూరిపేట రోడ్డులో ఘాట్ రోడ్డు పక్కన తాత్కాలిక బస్టాండ్ పనులను ఆర్టీసీ నిర్వహిస్తున్నది. నరసరావుపేట బస్టాండ్, చిత్రాలయ సెంటర్ నుంచి తిరునాళ్ల బస్సులను ఆర్టీసీ ఏర్పాటు చేస్తోంది. తిరునాళ్లకు ప్రత్యేకంగా 550 బస్సులను ఏర్పాటు చేస్తున్నట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. నరసరావుపేట నుంచి 280, చిలకలూరిపేట 100, అద్దంకి 35, ఒంగోలు 45, చీరాల 45, వినుకొండ నుంచి 45 బస్సులు ఏర్పాటు చేస్తున్నారు. ఘాట్ రోడ్డులో కొండ దిగువ నుంచి ఎగువకు భక్తుల కోసం తిరుమల నుంచి వచ్చిన 85 శేషాద్రి బస్సులు ఏర్పాటు చేస్తున్నారు. నరసరావుపేట నుంచి కొండ దిగువకు టిక్కెట్ రూ.30, కొండ దిగువ నుంచి కొండపైకి టిక్కెట్ రూ.25, చిలకలూరిపేట నుంచి రూ.30, వినుకొండ రూ.60, ఒంగోలు రూ.120, చీరాల రూ.100, అద్దంకి నుంచి రూ.105 టికెట్ ధరగా నిర్ణయించినట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు చెప్పారు.



కొండ దిగువున తాత్కాలిక ఆర్టీసీ బస్టాండ్ పనులు



పీవోల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్, జేసీ

ప్రక్రియపై అవగాహన ఉండాలి

ఎమ్మెల్సీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి నాగలక్ష్మి


గుంటూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కృష్ణా - గుంటూరు పట్టభద్రుల శాసనమండలి నియోజకవర్గ ప్రిసైడింగ్ అధికారులు పోలింగ్‌కు సంబంధించి ఎన్నికల సంఘం నిర్దే శించిన అన్ని ప్రక్రియలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. ఎన్నికలకు సంబంధించి ప్రిసైడింగ్, సెక్టార్ అధికారులకు శనివారం కలెక్ట రేట్లోని ఎస్ఆర్ శంకరన్ హాల్లో నిర్వహించిన శిక్షణ కార్యక్రమం లో ఆమె ప్రసంగించారు. పోలింగ్ రోజు ఉదయం 8 గంటలకి ఓటింగ్ ప్రారంభించేలా పోలింగ్ కేంద్రాల వద్ద అభ్యర్థుల వివ రాలు, ఇతర పోస్టర్లు ప్రదర్శించాలన్నారు. అభ్యర్థుల ఏజెంట్ల సమక్షంలో బ్యాలెట్ బాక్సులను పోలింగ్‌కు సిద్ధం చేయాలన్నా రు. టెండర్ ఓటు, ఛాలెంజ్ ఓటు ప్రక్రియను సక్రమంగా నిర్వ హించాలన్నారు. పోలింగ్ సమ యం ముగిసేసరికి కేంద్రం గేట్లు మూసేసి లోపల క్యూలో ఉన్న వారికి స్లిప్పులిచ్చి ఓటు వేసేందుకు అవకాశం కల్పించాలన్నారు. సమావేశంలో జేసీ భార్గవ్ తేజ, డీఆర్వో ఖాజావలి తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కెమేరాలు

పోలింగ్ రోజున కేంద్రాల వద్ద ఒకటి లోపల, మరొకటి బయట వెబ్ కెమేరాలను అమరుస్తామని నాగలక్ష్మి తెలిపారు. పోలింగ్, కౌంటింగ్‌పై ఆమె ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు, వారి ప్రతినిధులతో కలెక్టరేట్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడారు. పోలింగ్‌కు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేశామని, పోలింగ్‌కు 48 గంటల ముందు అభ్యర్థులు ప్రచారాన్ని నిలిపి వేయాలన్నారు. మార్చి 3న ఏసీ కళాశాలలో ఉదయం 8 గంటల కు కౌంటింగ్ ప్రారంభమవుతుందని, 28 టేబుల్స్ వేస్తామని, మూడు షిఫ్టులు నిర్వహిస్తామన్నారు. ఎన్నికల పోలింగ్‌కు పకడ్బందీగా ఏర్పాట్లు చేశామని ఆర్వో నాగలక్ష్మి ఎన్నికల పరిశీలకురాలు వీ కరుణకు నివేదించారు. శనివారం సాయంత్రం ఆమె వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు.

2015 రిపీటయ్యేనా?

- మండలి ఎన్నికల్లో విజయం కోసం టీడీపీ
- అప్పటి వరకు రెండుసార్లు టీచర్స్ ఎమ్మెల్సీగా లక్ష్మణరావు ఎన్నిక
- మూడోసారి ఆయన గెలుపునకు నాటి అధికార టీడీపీ బ్రేక్
- ఇప్పుడు పట్టభద్రుల ఎన్నికల్లోనూ అదేవ్యూహంతో అడుగులు




గుంటూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): కృష్ణా - గుంటూరు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ 2015లో ఎన్నికల్లో సాధించిన ఘన విజయాన్ని ఈ దఫా పట్టభద్రుల నియోజకవర్గంలో రిపీట్ చేసేందుకు టీడీపీ అన్ని ప్రయత్నాలు చేస్తున్నది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దిశానిర్దేశం, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేశ్ ఆదేశానుసారం ఆరు జిల్లాల నేతలు సమష్టిగా పార్టీకి తిరుగులేని మెజార్టీతో విజయాన్ని అందించేందుకు కృషి చేస్తున్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, సీనియర్ నేతలు నియో జకవర్గాల వారీగా బాధ్యత తీసుకుని పట్టభద్రులను ఆకర్షిస్తున్నారు. 2007లో శాసనమండలి పునరుద్ధరణ జరిగినప్పుడు ఉమ్మడి కృష్ణా - గుంటూరు జిల్లాల టీచర్స్ ఎమ్మెల్సీ నియోజకవర్గం నుంచి లక్ష్మణరావు గెలు పొందారు. అనంతరం జరిగిన లాటరీలో ఆయన పదవీ కాలం స్వల్ప వ్యవధిలోనే ముగిసింది. దాంతో 2009లో జరిగిన ఎన్నికల్లో రెండో సారి ఆయన టీచర్స్ ఎమ్మెల్సీగా గెలుపొందారు. 2015లో మరోసారి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు రాగా వివిధ వర్గాలు ఎమ్మెల్సీ లక్ష్మణరావు కు తిరుగేలేదని, ఆయన హ్యాట్రిక్ కొట్టడం ఖాయమని భావించాయి. అయితే ఆ సందర్భం లో టీడీపీ అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలు కాగా ఆ ఎన్నికని సీఎం చంద్రబాబు ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు. దాంతో ఆ ఎన్నికల్లో తొలి ప్రాధాన్య ఓట్ల లెక్కింపులోనే ఏఎస్ రామకృష్ణ గెలుపొందారు. కాగా ఇప్పుడు జరగబోతున్న పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నిక సమ యంలోనూ టీడీపీ బలపరిచిన కూటమి అధికారంలో ఉండటం.. సీఎంగా చంద్రబాబు ఉన్నారు. దీంతో టీడీపీ, జనసేన, బీజేపీ క్యాడర్ అంతా రంగంలోకి దిగింది. ప్రచార పరంగా మిగతా అభ్యర్థుల కంటే ఆల పాటి చాలా ముందు న్నారు. ఈ విధంగా 2015 టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఏ విధంగా అయితే టీడీపీ అభ్యర్థి గెలుపొందారో అదే రీతిన ఇప్పుడు ఆలపాటి గెలుపు కోసం ప్రతీ ఒక్క నాయకుడు, కార్యకర్త శ్రమిస్తున్నారు.

సాగర్‌లో.. వారబందీ

9 రోజులు సరఫరా.. 6 రోజులు నిలిపివేత

ఆయకట్టు పరిధిలో 87 వేల ఎకరాల్లో వరి సాగు



సాగర్ కుడి కాలువ

నరసరావుపేట, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ కుడి కాల్వ ఆయకట్టులో వారబందీ విధానాన్ని జలవనరుల శాఖ అమలు చేస్తోంది. జలాశయంలో నీటి నిల్వలు తగ్గిన నేపథ్యంలో జలవనరుల శాఖ ఈ నిర్ణయం తీసుకుంది. 9 రోజుల పాటు నీటి సరఫరా ఉంటుంది. తదుపరి ఆరు రోజులు నిలిపివేస్తారు. రైతులు రబీలో కూడా పెద్దఎత్తున వరి సాగు చేశారు. వారబందీ అమలుపై రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పంటలకు మార్చి 31 వరకు వారబందీ విధానంలో నీటి సరఫరా చేయనున్నారు. ఈ నెల 28 వరకు నీటి సరఫరా చేస్తారు. తదుపరి ఆరు రోజులు నీటి సరఫరాను నిలిపివేస్తారు. రానున్న వేసవికి తాగుకు కూడా నీటిని కేటాయించాల్సి ఉంది. ఆయకట్టు పరిధిలోని పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో వరి సాధారణ విస్తీర్ణం 1,05,695 ఎకరాలు కాగా 86,730 ఎకరాల్లో సాగు చేశారు. మిరపకు మార్చి నెలాఖరు వరకు సాగు నీరు అవసరం ఉంటుందని రైతులు తెలిపారు. ఏప్రిల్‌లో రెండు వారాల పాటు వరికి నీరు అవసరం ఉంటుందని రైతులు చెబుతున్నారు.

సాగర్‌లో 177.26 టీఎంసీల నీటి నిల్వ

నాగార్జున సాగర్‌లో 312.05 టీఎంసీలు పూర్తి నిల్వ సామర్థ్యం కాగా 177.26 టీఎంసీల నీటి నిల్వ ఉంది జలాశయం నీటి మట్టం 590 అడుగులు కాగా గురువారం 234.60 అడుగులు నీటి మట్టం నమోదైంది. మిర్చికి మార్చి 31 వరకు, వరికి ఏప్రిల్ నెలాఖరు వరకు సాగు నీరు అవసరం ఉందని అప్పటి వరకు సాగు నీరు సరఫరా చేయాలని రైతులు కోరుతున్నారు.

ఐదు కిలోల బంగారం చోరీ కేసులో వీడిన మిస్టరీ

6

- షాపులో పనిచేసే ఇరువురు కీలకపాత్ర
- ఏడుగురు నిందితులు అరెస్ట్... పరారీలో మరొకరు
- ఐదు కిలోల బంగారు ఆభరణాలు, రెండు ద్విచక్ర వాహనాలు, రెండు లక్షల నగదు స్వాధీనం



మూడు వంతెనల వద్ద కొనసాగుతున్న ఆర్‌యూబీ నిర్మాణ పనులు

మూడొంతెనల పనుల్లో జాప్యం

- ఈ నెల 25కి ఆర్‌యూబీ పనుల పూర్తి అసాధ్యం
- డొంకరోడ్డు నుంచి వెళ్లేందుకు అడ్డుగా భవనం
- చిన్న పైపుల్లో డ్రెయినేజ నీరు ప్రవాహం సాధ్యపడేనా?
- రైల్వే, కార్పొరేషన్ మధ్య సమన్వయలోపం.. నగర వాసులకు తంటాలు

గుంటూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): రైల్వే, గుంటూరు నగరపాలక సంస్థల మధ్య సమన్వయలోపానికి డొంకరోడ్డు మూడొంతెనల ఆర్‌యూబీ నిర్మాణ పనులు అద్దం పడుతున్నాయి. నిర్దిష్టమైన ప్రణాళిక రూపొందించుకోకుండా ఆదరాబాదరాగా పనులు ప్రారంభించిన రైల్వే శాఖ ఇప్పుడు వాటిని పూర్తి చేసి ఆర్‌యూబీని అందుబాటులోకి తీసుకొచ్చేందుకు నానా తంటాలు పడుతున్నది. ఇప్పటికే ఒక దఫా గడువు తేదీని పొడిగింపు చేసుకున్న ఆ శాఖ మరికొన్ని రోజుల సమయాన్ని కోరేందుకు సిద్ధమైనట్లు తెలిసింది. మరో మూడు రోజుల్లో పనులు పూర్తి కావాల్సి ఉండగా క్షేత్రస్థాయిలో ఆ పరిస్థితి ఏ కోశాన కనిపించడం లేదు. రైల్వే యార్డు రీమోడలింగ్‌లో భాగంగా ఎనిమిదో నంబరు ప్లాట్‌ఫాంని రైల్వే శాఖ నిర్మిస్తున్నది. ఈ నేపథ్యంలో కొత్త రైలుమార్గం విజయవాడ వైపునకు నిర్మాణం చేయాల్సి వచ్చింది. దాంతో మూడొంతెనల రైలు మార్గాన్ని ఆర్‌సీసీ బ్లాకులతో పునర్నిర్మాణం గత ఏడాది డిసెంబరులో చేపట్టింది. షెడ్యూల్ ప్రకారం ఈ నెల ప్రారంభంలోనే పనులు పూర్తి చేసి ఈ అండర్ బ్రిడ్జి అందుబాటు లోకి తేవాల్సి ఉన్నది. అయితే కార్పొరేషన్ వాటర్ పైపులైను వంతెన కింది భాగంలో ఉండటంతో దానిని మార్పు చేయడానికి మరికొంత సమయాన్ని రైల్వే శాఖ కోరింది. దాంతో ఈ నెల 25 లోపు ఎట్టి పరిస్థితుల్లో ఆర్‌యూబీ నిర్మాణాన్ని పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని జిల్లా యంత్రాంగం ఆదేశించింది. అయితే ఇప్పటివరకు పైపులైను షిఫ్టింగ్ పనులు పూర్తి కాలేదు. అలానే డ్రెయినేజి పనులు కూడా ఒక కొలిక్కి రాలేదు. ఈ వంతెన కిందగా వాహనాలతో పాటు పాదచారులు రాకపోకలు సాగిస్తుంటారు. అలాంటిది ఒక వైపునే కాలిబాటని రైల్వే శాఖ నిర్మిస్తున్నది. దీని వల్ల భవిష్యతులో సమస్యలు తలెత్తే అవకాశం ఉన్నది. అలానే డ్రెయినేజీ మళ్లింపు కోసం ఏర్పాటు చేస్తున్న పైపుల సైజు చాలా చిన్నదిగా ఉండటంతో అసలు వాటిల్లో నుంచి నీరు ప్రవహిస్తుందా అన్న అనుమానాలు వస్తున్నాయి. మరోవైపు ఆర్‌సీసీ బ్లాకులతో ఆర్‌యూబీ నిర్మాణం కారణంగా డొంకరోడ్డు వైపునకు సమస్యలు తలెత్తాయి. బ్లాకుల అమరిక కారణంగా ఎడమవైపునకు ఎలైన్‌మెంట్ మారిపోవడంతో ఇప్పుడు అక్కడ ఉన్న ఓ భవనాన్ని కొంతమేరకు తొలగించాల్సిన పరిస్థితి ఉత్పన్నమైంది. లేకుంటే డొంకరోడ్డు నుంచి కొత్తపేట/నెహ్రూనగర్ వైపునకు కార్లు వెళ్లలేని పరిస్థితి. ఈ విషయంలో నగరపాలకసంస్థతో సమన్వయం చేసుకోవాల్సిన రైల్వే శాఖ తన పనిని పూర్తి చేసి వదిలేయాలని భావిస్తున్నట్లుగా ఉన్నది.



కొనసాగుతున్న ఆర్‌యూబీ నిర్మాణ పనులు



బాల కార్మిక వ్యవస్థకు వ్యతిరేకంగా ఉద్యమించాలి



పద్మశ్రీ శాంతా సిన్హాను సత్కరిస్తున్న ఎస్ఆర్ఎం ప్రతినిధులు

మంగళగిరి సిటీ, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): దేశ వ్యాప్తంగా వేళ్లూనుకున్న బాల కార్మిక వ్యవస్థకు వ్యతిరేకంగా ప్రతి ఒక్కరూ ఉద్యమించాలని జాతీయ బాలల హక్కుల రక్షణ కమిషన్ మాజీ చైర్‌పర్సన్, పద్మశ్రీ డాక్టర్ శాంతా సిన్హా పిలుపునిచ్చారు. 'చదువుతోనే బాల కార్మిక వ్యవస్థకు విమోచన' పేరిట మంగళగిరిలోని ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో శనివారం చర్చాగోష్టి నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన శాంతా సిన్హా ఉద్యోగులు, విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. గడిచిన 30 ఏళ్లుగా బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ఎంవీ ఫౌండేషన్ ద్వారా చేస్తున్న పోరాటాలను వివరించారు. నిరక్షరాస్యత, పేదరికం వల్లనే బాల కార్మికులు గణనీయంగా పెరుగుతున్నారని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమగ్రమైన చట్టాలను తీసుకువచ్చి, రాత్రి బడులు నిర్వహించడం, బ్రిడ్జి కోర్సుల సెంటర్లు ఏర్పాటు చేయడం వంటి సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఇందుకోసం బడ్జెట్‌లో నిధులు కేటాయించి బాల కార్మిక రహిత సమాజ స్థాపనకు నడుం బిగించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్ఆర్ఎం వైస్‌చాన్స్‌లర్ ఆచార్య మనోజ్‌కుమార్ అరోరా, రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్.ప్రేమ్‌కుమార్, డీన్ విష్ణు పథ్, డాక్టర్ సీవీ టామీ, రీసెర్చ్ డీన్ డాక్టర్ రంజిత్ థాపా పాల్గొన్నారు.

24, 25 తేదీల్లో ప్రత్యేక రైళ్లు

గుంటూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ఈ నెల 24, 25 తేదీల్లో గుంటూరు మీదుగా ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో ఏ శ్రీధర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నంబరు. 07753 చర్లపల్లి - దానాపూర్ ఈ నెల 24న, నంబరు. 07755 చర్లపల్లి - దానాపూర్ రైలు ఈ నెల 25న ఉదయం 9.30 గంటలకు బయలుదేరి పిడుగురాళ్ల, గుంటూరు, విజయవాడ, ఏలూరు మార్గంలో ప్రయాణించి రెండో రోజు వేకువజామునకు ముందు 2 గంటలకు దానాపూర్ చేరుకొంటాయి. నంబరు. 07754 దానాపూర్ - చర్లపల్లి రైలు ఈ నెల 24న, నంబరు. 07756 దానాపూర్ - చర్లపల్లి రైలు ఈ నెల 25న మధ్యాహ్నం 3.30 గంటలకు బయలుదేరి గుంటూరు, పిడుగురాళ్ల మీదుగా రెండో రోజు ఉదయం 8.15 గంటలకు చర్లపల్లి చేరుకొంటాయి. వీటికి అడ్వాన్స్ రిజర్వేషన్ ఈ నెల 23 ఉదయం 8 గంటలకు ప్రారంభమౌతుందని సీపీఆర్‌వో తెలిపారు.

బంగారం చోరీ కేసులో వీడిన మిస్టరీ



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్, అదనపు ఎస్పీలు సుప్రజ, రవికుమార్, ట్రైనీ ఐపీఎస్ దీక్షా

గుంటూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఇటీవల సంచలనం సృష్టించిన ఐదు కోట్ల ఖరీదైన ఐదు కిలోల బంగారు ఆభరణాల చోరీ కేసులో మిస్టరీ వీడింది. బంగారం దుకాణంలో పనిచేసే ఇద్దరు వ్యక్తులు కీలకపాత్రదారులుగా పోలీసుల విచారణలో తేలింది. దీంతో ఏడుగురు నిందితులను అరెస్టు చేసి వారి నుంచి చోరీకి గురైన ఐదు కిలోల బంగారు ఆభరణాలు, రెండు ద్విచక్ర వాహనాలు, రెండు లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ నిందితులను మీడియా ఎదుట హాజరు పరిచి వివరాలు వెల్లడించారు. ఎస్పీ కథనం మేరకు.... మంగళగిరిలోని వీవర్స్ కాలనీకి చెందిన దివి రాము విజయవాడలో డీవీఆర్ జ్యువెలర్స్ పేరుతో బంగారు దుకాణం నిర్వహిస్తున్నారు. ఈ నెల 17న ఆయన నల్గొండ, సూర్యాపేట, నకిరేకల్ తదితర ప్రాంతాలకు బంగారు ఆభరణాలు పంపించాల్సి ఉంది. ఇందుకుగానూ ఐదు కోట్ల రూపాయల ఖరీదైన ఐదు కిలోల బంగారపు ఆభరణాలను షాపులో పనిచేసే తనకు సమీప బంధువైన దివి నాగరాజుకు ఇచ్చి మంగళగిరిలోని తన ఇంటికి తీసుకురావాల్సిందిగా చెప్పారు. ఈ క్రమంలో ఈ నెల 15న రాత్రి సుమారు 8.50 గంటల సమయంలో నాగరాజు తన ద్విచక్ర వాహనంపై ఐదు కిలోల బంగారు ఆభరణాలు ఉన్న బ్యాగును తీసుకొని మంగళగిరి బయలుదేరాడు. అయితే నాగరాజు ఆత్మకూరు అండర్ పాస్ వద్దకు రాగానే రాత్రి 9 గంటల సమయంలో గుర్తుతెలియని దుండగులు తన నుంచి బ్యాగు అపహరించుకు పోయారంటూ నాగరాజు యజమాని రాముకు ఫోన్ చేసి చెప్పారు. వెంటనే రాము పోలీసులకు ఫిర్యాదు చేశా

పక్కా ప్రణాళిక ప్రకారం దోపిడీ

విజయవాడలోని డీవీఆర్ బంగారం షాప్‌లో పనిచేసే నాగరాజు, భరత్ ఈ చోరీకి పథకం రూపొందించారు. భరత్, నాగరాజులతోపాటు వారి స్నేహితులు గతంలో బంగారం పని చేసిన నవీన్ ఇర్ఫాన్, మోహన్, వారి స్నేహితులైన లోకేష్, చందు, అరుణ్ అలియాస్ బిక్షు ముఠాగా ఏర్పడి పథకం రూపొందించారు. ఈ క్రమంలో ఇర్ఫాన్, మోహన్, నవీన్ ముగ్గురూ రెండు ద్విచక్ర వాహనాలపై నాగరాజును అనుసరిస్తూ వచ్చారు. ఆత్మకూరు అండర్ పాస్ వద్దకు రాగానే ముగ్గురు నిందితులు నాగరాజు వద్దన్న బ్యాగు తీసుకుని ఉడాయించారు. అపహరించుకుపోయిన ఐదు కిలోల బంగారాన్ని బైక్ టైర్ లో దాచారు. నాగరాజు వెల్లడించిన వివరాల మేరకు మొత్తం ఎనిమిది మంది ఈ నేరానికి పాల్పడినట్లు గుర్తించారు. ఏడుగురుని అరెస్టు చేశారు.

అరెస్టు అయిన వారు వీరే..

విజయవాడలోని పాయకాపురంకు చెందిన అడపాల భరత్, మంగళగిరికి చెందిన దివి నాగరాజు, విజయవాడ భవానిపురంకు చెందిన కొరివి నవీన్, చిట్టినగర్ వాగు సెంటర్‌కు చెందిన వెల్పూర్తి మోహన్ కృష్ణ, కేదారేశ్వరరావు పేట 5వ లైన్‌కి చెందిన వరకాల లోకేష్, గొల్లపూడి రోడ్డుకు చెందిన పొట్నూరి చంద్రశేఖర్, వించిపేట గాంధీ బొమ్మ సెంటరుకు చెందిన చికామణి అరుణ్ కుమార్ తదితరులను అరెస్టు చేశారు. మరో నిందితుడైన షేక్ ఇర్ఫాన్ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఈ కేసులో ప్రధాన నిందితుడైన నాగరాజు సతీమణి గతంలో పోలీసు కానిస్టేబుల్‌గా పనిచేస్తూ మూడు నెలల క్రితం ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది.

సీఏ విద్యార్థులకు ఉపాధి కల్పించడమే లక్ష్యం



ప్రమాణ స్వీకారోత్సవానికి హాజరైన ఐసీఏఐ నూతన కార్యవర్గ సభ్యులు

- ఐసీఏఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రసన్నకుమార్

గుంటూరు (విద్య), ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): సీఏ విద్యార్థుల భవిష్యత్తు కోసం వారికి ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా ది ఇనిస్టిట్యూట్ ఆఫ్ చార్టెడ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) గుంటూరు బ్రాంచి కృషి చేయాలని ఐసీఏఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.ప్రసన్నకుమార్ విజ్ఞప్తి చేశారు. శనివారం స్థానిక అమరావతి రోడ్డులో ఉన్న బండ్లమూడి గార్డెన్స్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రసన్నకుమార్ మాట్లాడుతూ విద్యార్థుల కోసం నూతన భవనం నిర్మించాలని సూచించారు. చార్టెడ్ అకౌంటెంట్స్‌ల భవిష్యత్తుకు ఉపయోగపడేలా మంచి ప్రణాళిక రచిస్తామన్నారు. ఐసీఏఐ న్యూ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి అమరావతి సెంటర్‌ను ప్రకటించారు. రానున్న సంవత్సరానికి సమగ్ర కార్యాచరణను రూపొందించుకొని గుంటూరు బ్రాంచిను జాతీయస్థాయిలో ఉత్తమ స్థానాన్ని పొందాలని ఆకాంక్షించారు. గుంటూరు బ్రాంచి చైర్మన్ చింతా వీఎస్ఎస్ రఘునందన్ మాట్లాడుతూ బ్రాంచి అభివృద్ధికి, సీఏ మెంబర్స్, సీఏ విద్యార్థులు, వర్తక సంఘాలు, ప్రభుత్వ రంగ సంస్థల మధ్య గుంటూరు బ్రాంచి ఒక వారధిలా పని చేసేలా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో సెక్రటరీ వనిమిరెడ్డి వెంకట నరేష్ , వైస్ చైర్మన్ రుద్రవరపు భరద్వాజ ట్రెజరర్ కన్నెగంటి మృత్యుంజయరావు, సికాసా చైర్మన్ సీఏ రాజశేఖర్, కమిటీ సభ్యులు బాజీ షేక్, దేసు సంపత్ , మాజీ చైర్మన్ నూతలపాటి అమర్నాథ్, సెంట్రల్ కౌన్సిల్ మెంబర్ ముప్పాళ్ల శ్రీధర్, ముప్పాళ్ల సుబ్బారావు, ఎస్ఐఆర్‌సీ సెక్రటరీ, ఎక్స్ అఫిషియో ఆఫ్ గుంటూరు ఎర్ర తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు గ్రూపు-2 మెయిన్స్ పరీక్ష

గుంటూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీసు కమిషన్ గ్రూపు-2 మెయిన్స్ పరీక్ష ఆదివారం జరుగుతుంది. జిల్లాలో మొత్తం 11 పరీక్ష కేంద్రాల్లో 9,277 మంది అభ్యర్థులు పరీక్ష రాయబోతున్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పేపర్-1, మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటలకు వరకు పేపర్-2 పరీక్ష జరుగుతుంది. ఇందుకోసం ఏపీపీఎస్‌సీ నుంచి అన్ని పరీక్ష కేంద్రాలకు చీఫ్ సూపరింటెండెంట్‌లు, ఇతర సిబ్బంది వచ్చారు. అలానే జిల్లా నుంచి లైజాన్ అధికారులను కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి నియమించారు. అభ్యర్థుల కోసం కలెక్టరేట్‌లో కంట్రోల్ రూంని ఏర్పాటు చేశారు. నంబరు. 08632234070కు ఫోన్ చేసి సమాచారం తెలుసుకోవచ్చని జిల్లా రెవెన్యూ అధికారి ఎస్ షేక్ ఖాజావలి తెలిపారు. పరీక్ష కేంద్రాలలోకి అభ్యర్థులను ఉదయం 8.30 గంటల నుంచి 9.30 గంటల వరకు, గ్రేస్ పీరియడ్ 15 నిమిషాలు కలిపి 9.45 వరకు అనుమతిస్తామన్నారు. అలానే మధ్యాహ్నం 1.30 గంటల నుంచి 2.30 గంటల వరకు గ్రేస్ పీరియడ్ 15 నిమిషాలు కలిపి 2.45 వరకు అనుమతిస్తారని తెలిపారు. అభ్యర్థులు హాల్‌టిక్కెట్‌తో పాటుగా ప్రభుత్వం జారీ చేసిన ఏదైనా ఒరిజినల్ గుర్తింపు కార్డుని వెంట తెచ్చుకోవాలన్నారు. మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్లు వంటివి లోనికి అనుమతించబోమన్నారు. అలానే పరీక్ష కేంద్రాలకు దగ్గరలో జిరాక్స్, నెట్ సెంటర్లను మూసేయిస్తామన్నారు.

పరీక్ష జరిగే కేంద్రాలు ఇవే...

మలినేని లక్ష్మయ్య మహిళా ఇంజనీరింగ్ కళాశాల(పుల్లడిగుంట), విజ్ఞాన్ యూనివర్శిటీ(వడ్లమూడి), చలపతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ(లాం), కేకేఆర్ అండ్ కేఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాల (వింజనంపాడు), విజ్ఞాన్ డిగ్రీ కళాశాల (పెదపలకలూరు రోడ్డు), విజ్ఞాన్ నిరుల ఇంజనీరింగ్ కళాశాల (పెదపలకలూరు రోడ్డు), ఎన్ఆర్ఐ ఇంజనీరింగ్ కళాశాల (విశదల, పేరేచర్ల), ఆంధ్ర క్రైస్తవ కళాశాల (సాంబశివపేట, గుంటూరు), జీవీఆర్ అండ్ ఎస్ ఇంజనీరింగ్ కళాశాల (బుడంపాడు), ఆర్‌వీఆర్ అండ్ జేసీ ఇంజనీరింగ్ కళాశాల (చౌడవరం), ప్రియదర్శిని ఇంజనీరింగ్ కళాశాల(పుల్లడిగుంట).

బడ్జెట్‌లో నీటి ప్రాజెక్టులకు 10 శాతం కేటాయించాలి



మాట్లాడుతున్న రామకృష్ణ, పాల్గొన్న ముప్పాళ్ల నాగేశ్వరరావు, జంగాల

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

గుంటూరు (తూర్పు), ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 24 నుంచి జరగనున్న అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలలో సుమారు మూడు లక్షల కోట్ల బడ్జెట్ ప్రవేశపెట్టనుందని ప్రచారం జరుగుతుందనీ, అయితే ఈ బడ్జెట్ అప్పులపై ఆధారపడే బడ్జెట్ కాకూడదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ అన్నారు. గుంటూరు మల్లయ్య లింగం భవన్లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ భారీ బడ్జెట్ ప్రవేశపెట్టాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం ఉందనీ, అసలు రాష్ట్రానికి అంత ఆదాయం వస్తుందా అనే విషయాన్ని ఆలోచించాలని సూచించారు. జగన్ ఏ తప్పులు అయితే చేశాడని ఆనాడు విమర్శలు చేశామో ప్రస్తుతం చంద్రబాబు కూడా అదే తప్పులు చేస్తున్నారని అన్నారు. ఇరిగేషన్ ప్రాజెక్టులకు బడ్జెట్లో ప్రాధాన్యత ఇవ్వాలనీ, 10 శాతం నిధులు కేటాయించాలని కోరారు. ఎన్టీఆర్ హయాంలో ప్రారంభించిన హంద్రీనీవా, వెలుగొండ తదితర ప్రాజెక్టులు 30 సంవత్సరాలు గడిచినా నేటికీ పూర్తి కాలేదన్నారు. సూపర్ సిక్స్ అమలుకు నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వ ఆర్థిక విధానాలను వ్యతిరేకిస్తూ మార్చి 23 నుంచి ఏప్రిల్ 14 వరకు సీపీఐ ఆధ్వర్యంలో ప్రచార కార్యక్రమాలను దేశవ్యాప్తంగా చేపట్టనున్నట్టు తెలిపారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ అగ్రిగోల్డ్ బాధితులకు సత్వరమే న్యాయం చేయాలని కోరుతూ ఈ నెల 24న రాష్ట్ర వ్యాప్తంగా అన్ని కలెక్టర్ కార్యాలయాల్లో అర్జీలు అందజేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో జంగాల అజయ్‌కుమార్, కోటా మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

మత విభేదాలతో ఏ దేశం అభివృద్ధి చెందదు



ప్రసంగిస్తున్న ఆచార్య శామ్యూల్, వేదికపైన అధికారులు

పెదకాకాని, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఏ దేశంలోనైనా మత విభేదాలు ఉన్నట్లయితే ఆ దేశం అభివృద్ధికి దూరంగా ఉండటంతోపాటు దేశ అభివృద్ధి కూడా జరగదని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని సెంటర్ ఫర్ డాక్టర్ అంబేడ్కర్ చైర్ పూర్వ విభాగాధిపతి ఆచార్య నాలాది శామ్యూల్ అన్నారు. విభాగం ఆధ్వర్యంలో రెండు రోజులుగా అంబేడ్కర్ విజన్ ఆన్ ఇంటర్ప్లే ఆఫ్ సోషియో పొలిటికల్ ఎకనామిక్ ఫ్యాక్టర్స్ ఇన్ ఇండియా అనే యూజీసీ జాతీయ సదస్సు శనివారం ముగిసింది. ముగింపు కార్యక్రమంలో పరిశోధకులను, అధ్యాపకులను ఉద్దేశించి ఆచార్య శామ్యూల్ మాట్లాడుతూ ప్రస్తుతం చాలా దేశాలు మతాన్ని ఆధారంగా చేసుకొని యుద్ధాలు చేస్తున్నాయనీ, మరికొన్ని దేశాలు అభివృద్ధికి నోచుకోని స్థితిలో ఉన్నాయంటే అక్కడ అంబేడ్కర్ వంటి మహానుభావులు రాసిన రాజ్యాంగం లేకపోవడమే కారణమన్నారు. నేటి యువత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్‌ను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అంబేడ్కర్ చైర్ విభాగాధిపతి ఆచార్య వై.అశోక్ కుమార్ మాట్లాడుతూ సదస్సుకు 40 పరిశోధన పత్రాలు వచ్చాయనీ, వాటిల్లో ముఖ్యమైన అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లనున్నట్లు వివరించారు. భారతి దాసన్ యూనివర్సిటీకి చెందిన ప్రొఫెసర్ వెంకటాచలం, డాక్టర్ మద్దూ అంకయ్య, డాక్టర్ భవాని, డాక్టర్ లావణ్య, బాబు జగ్జీవన్‌రామ్ చైర్ డైరెక్టర్ ఆచార్య పీజే రత్నాకర్ ప్రసంగించారు. సదస్సులో విద్యా విభాగం అధ్యాపకులు డాక్టర్ ఎం.వసంతరావు ప్లీనరీ సెషన్ నిర్వహించారు. అంబేడ్కర్ చైర్ అసిస్టెంట్ ప్రొఫెసర్, సదస్సు కోశాధికారి డాక్టర్ కె.అబ్రహం లింకన్, విభాగం సిబ్బంది డాక్టర్ వి.శ్రీనివాస్, ఎస్.అబ్రహం, పరిశోధకులు జె.అనిల్ కుమార్ బి.కోటి యాదవ్, రంగనాథ్, రత్న శేఖర్, అనురాధ పాల్గొన్నారు.

ఎక్సైజ్ శాఖ నూతన కార్యవర్గం ఎన్నిక



నూతనంగా ఎన్నికైన జిల్లా ఎక్సైజ్ శాఖ ఎగ్జిక్యూటివ్ కార్యవర్గం

గుంటూరు కార్పొరేషన్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఆఫీసులో అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలుగా గుంటూరు టూ టౌన్ సీఐ ఎం.యశోదరా దేవి ఎన్నికయ్యారు. శనివారం నగరంలోని ఒక ప్రైవేటు హోటల్లో జరిగిన అసోసియేషన్ ఎన్నికలలో ఆమె అత్యధిక ఓట్ల మెజార్టీతో జిల్లా అధ్యక్షురాలుగా గెలుపొందారు. యశోదరా దేవిపై పోటీ చేసిన సత్తెనపల్లి సీఐ విజయ్ కుమార్‌కు స్వల్ప ఓట్లు మాత్రమే వచ్చాయి. జిల్లా వ్యాప్తంగా యశోదరాదేవికి అధికారులు మద్దతు పలికి భారీ మెజార్టీతో గెలిపించారు.

అధ్యక్షురాలిగా యశోదరా దేవి..

అధ్యక్షురాలుగా ఎం.యశోదరా దేవి, అసోసియేటెడ్ ప్రెసిడెంట్‌గా ఎస్సీ సుబ్బారావు (ఎస్సై, నాగార్జునసాగర్ చెక్ పోస్ట్), వైస్ ప్రెసిడెంట్‌గా కె.కర్ల (సీఐ పిడుగురాళ్ల), ప్రధాన కార్యదర్శిగా పీఆర్‌కే మూర్తి (ఎస్సై- గుంటూరు-2), ఆర్గనైజింగ్ కార్యదర్శిగా జి. వీరాంజనేయులు (సీఐ మంగళగిరి), ట్రెజరర్‌గా (కృష్ణారెడ్డి), ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులుగా డి.శ్రీనివాసరావు (సీఐ వినుకొండ), ఎం.శ్రీరాం ప్రసాద్ (సీఐ నగరం), ఆర్ తారా లక్ష్మి(ఎస్సై, నరసరావుపేట), టి.ఫణి కుమార్ (సీఐ తెనాలి). నూతనంగా ఎన్నికైన కమిటీని ఉన్నతాధికారులు ప్రత్యేకంగా అభినందించారు.

రైతులు నేరుగా రైతుబజార్లకు రావొచ్చు

గుంటూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో టమాట, కూరగాయలు పండిస్తున్న రైతులకు అండగా నిలిచేందుకు మార్కెటింగ్ శాఖ సిద్ధమైంది. రైతులు దళారుల బారినపడి తమ పంటను తక్కువ ధరకు అమ్ముకొని నష్టపోకుండా ఉండేందుకు సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు పంట ఉత్పత్తుల విక్రయానికి రైతుబజార్లలో అవకాశం కల్పించనున్నట్లు ఆ శాఖ ప్రకటించింది. ఇప్పటికే నారాకోడూరు పరిసర ప్రాంతాల్లో టమాట పండిస్తున్న రైతులతో మాట్లాడి వారి వద్ద నేరుగా టమాటలను కొనుగోలు చేసినట్లు మార్కెటింగ్ శాఖ గుంటూరు జిల్లా ఏడీ బి. రాజబాబు తెలిపారు. టమాటాలే కాకుండా క్యాలీఫ్లవర్, క్యాబేజీ వంటి కూరగాయలను రైతులు నేరుగా రైతుబజార్లకు తీసుకొచ్చి విక్రయించుకోవచ్చని సూచించారు. రైతుబజార్ల ద్వారా అమ్ముకొనేందుకు గుంటూరు నగరంలోని కృష్ణనగర్ రైతుబజార్ ఎస్టేట్ అధికారి నంబరు. 9182361301ని సంప్రదించాలని సూచించారు. అలానే సమీపంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీల సెక్రెటరీలను సంప్రదించినా పంట ఉత్పత్తులు విక్రయించుకోవడానికి ప్లాట్‌ఫాం ఏర్పాటు చేస్తామన్నారు. టమాట రైతులు రైతుబజార్లలో కేజీ రూ.13 చొప్పున విక్రయించుకోవచ్చని సూచించారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.65
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	87, 99,108
చికెన్ విత్ స్కిన్	172.00
చికెన్ స్కిన్ లెస్	182.00

25న జిల్లా స్థాయి ఫెన్సింగ్ ఎంపికలు

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): గుంటూరు ఫెన్సింగ్ స్పోర్ట్స్ అసోసి యేషన్ ఆధ్వర్యంలో స్థానిక పొత్తూరు గ్రామంలో ఈసీఎం ఈ పాఠశాలలో ఈ నెల 25న అండర్-14 బాల, బాలికల విభాగాల్లో జిల్లా స్థాయి ఎంపికలు నిర్వహిస్తున్నట్టు అసోసి యేషన్ జిల్లా కార్యదర్శి డి.అశోక్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల్గిన క్రీడాకారులు తమ ధ్రువీకరణ పత్రాలతో అదే రోజున ఉదయం 9 గంటలకు హాజరవ్వాలని అన్నారు. ఎంపికైన క్రీడాకారులు మార్చి 1న కంచికచర్లలో జరిగే ఏపీ స్టేట్ సబ్ జూనియర్ ఫెన్సింగ్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటారని వివరించారు. వివరాలకు 7075508842ను సంప్రదించాలన్నారు.

'మార్క్సిస్టు ఆలోచనాపరులు' సదస్సును జయప్రదం చేయాలి

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): భారత కమ్యూనిస్టు ఉద్యమ శత వార్షిక సందర్భంగా విజయవాడలో నేడు జరిగే 'మార్క్సిస్టు ఆలోచనాపరులు' సదస్సును జయప్రదం చేయాలని సదస్సు నిర్వహణ కమిటీ సభ్యులు సీనియర్ న్యాయవాది వై కోటేశ్వరరావు(వైకే), ఇతర సభ్యులు కోరారు. సదస్సులో భారత కమ్యూనిస్టు ఉద్యమ పురోగమనం, అవశ్యకత, అవకాశాలు, అవరోధాలు అనే అంశంపై చర్చించనున్నట్టు తెలిపారు.

ఆకట్టుకున్న సత్యహరిశ్చంద్ర పౌరాణిక పద్య నాటక ప్రదర్శన

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సృజనాత్మకత, సంస్కృతీ సమితి, విజయవాడ వారి సౌజన్యంతో మహాశివరాత్రి సందర్భంగా శనివారం కాకాని మండలం తక్కెళ్లపాడులో జరిగిన సత్యహరిశ్చంద్ర పౌరాణిక పద్య నాటక ప్రదర్శన ఆకట్టుకుంది. నాటకానికి హార్మోనియంపై ఎన్ సిద్దయ్య, తబలాపై ఏం.రాము వాయిద్య సహకారాన్ని అందించారు. కార్యక్రమంలో గుంటూరు కళాకారుల సంఘం అధ్యక్షుడు నల్లక శ్రీనివాసరావు, అమ్మిశెట్టి నాగేశ్వరరావు తక్కెళ్లపాడు సర్పంచ్ కూచిపూడి రత్నకుమారి పాల్గొని కళాకారులను సత్కరించారు.

కల్తీ నూనె తయారీ దారులపై కేసులు నమోదు చేస్తాం

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): కల్తీ నూనె తయరీ దారులపై కఠిన చర్యలు తీసుకుంటామని జాయింట్ ఫుడ్ కంట్రోలర్ ఎన్.పూర్ణచంద్రరావు స్పష్టం చేశారు. నరసరావుపేటలో అయిల్ రీ ప్యాకింగ్ యానిట్‌లపై శనివారం దాడులు నిర్వహించామని చెప్పారు. ఆయిల్ శాంపిల్స్ తీసుకుని ల్యాబోరేటరీకి పంపామని అన్నారు. కల్తీ నిర్ధారణ అయితే సదరు తయా రీదారులపై కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు.

తడి-పొడి చెత్తపై అవగాహన

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషనర్ ఆదేశాల మేరకు రూరల్ మండలంలో గ్రామ పంచాయతీలలో శనివారం తడి చెత్త- పొడి చెత్త వేరు చేసే విధానం గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. లాలుపురం గ్రామంలో ఇంటింటి ప్రచారంలో మండల విస్తరణ అధికారి శ్రీనివాసరావు పాల్గొని అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పంచాయతి సెక్రటరీ షేక్ మహబూబ్ సుభాని, సచివాలయం సిబ్బంది, క్లాప్ మిత్రులు పాల్గొన్నారు.

బుర్ర కథ పాటలతో ప్రజా చైతన్యానికి నాంది పలికిన నాజర్

గుంటూరు, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): నాటి రోజుల్లోనే బుర్రకథ పాటలతో ప్రజా చైతన్యానికి బుర్రకథ పితామహుడు నాజర్ నాంది పలికారని ఆంధ్రప్రదేశ్ రజక జనసేవా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జూపూడి శ్రీనివాసరావు తెలిపారు. ఏపీ రజక జన సేవా సంఘం ఆధ్వర్యంలో కాకుమానివారితోట ఐదో లైనులోని యానాది స్కూల్ సెంటర్లో పద్మశ్రీ నాజర్ 28వ వర్ధంతి సభ శనివారం జరిగింది. జూపూడి మాట్లాడుతూ నాజర్ పొన్నెకల్లులో అతి సామాన్య కుటుంబంలో జన్మించి పేదరికంతో అనేక కష్టనష్టాలను ఎదుర్కొన్నార న్నారు. సమాజంలోని నాటి రుగ్మతలపై ఆయన బుర్రకథ ద్వారా జాతీయ స్థాయిలో ప్రజల్ని ఉద్యమం వైపు నడిపిన, గొప్ప మేధావి అని కొనియాడారు. కార్యక్రమంలో బహుజన మహాసభ సెంట్రల్ కమిటీ కార్యదర్శి జీఆర్ భగత్ సింగ్, వివిధ సంఘాల నాయకులు పెనుమాక రమాదేవి, నీలాంబరం, మాధవీలత, విజయలక్ష్మీ, వీరాస్వామి ఉన్నారు.

కన్నెగంటి పోరాటాలు చిరస్మరణీయం

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): పశువులు, మేకలు తినే గడ్డి, ఆకుల పై, కట్టెపుల్లలపై బ్రిటీష్ వారు విధించే 'పుల్లరి' పన్నుకు వ్యతిరేకంగా పోరాడిన యోధుడు కన్నెగంటి హనుమంతు అని విశ్రాంత ఎస్పీ చక్రపాణి కొనియాడారు. స్థానిక గుజ్జనగుండ్ల, రామిశెట్టి రామారావు పాఠశాలలో ఏపీ కన్నెగంటి హనుమంతు మెమోరియల్ స్పోర్ట్స్ సొసైటీ ఆధ్వర్యంలో శనివారం హనుమంతు వర్ధంతి నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ నేటి యువత ఆయన ఆశయసాధనకు కృషి చేయాలని కోరారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయులను సొసైటీ వారు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సొసైటీ సభ్యులు తిరుమలశెట్టి నాగరాజు, సత్యనారాయణ, శ్రీనివాసరావు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

గుంటూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక పట్టాభిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఫాతిమాపురంనకు చెందిన వల్లంశెట్టి సాంబయ్య (45) అవమానాస్పదలో మృతి చెందారు. సాంబయ్యకు వివాహం కాలేదు. కొంత కాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. ఫాతిమాపురంలో సాంబయ్య ఒంటరిగా ఉంటున్నాడు. ఇదిలా ఉంటే శనివారం తన బాబాయిని చూసేందుకు ఆయన అన్న కుమారుడు వల్లంశెట్టి మణికంఠ వెళ్లారు. అప్పటికే సాంబయ్య మృతి చెంది ఉన్నాడు. మణికంఠ ఫిర్యాదు మేరకు పట్టాభిపురం పోలీసులు అనుమానాస్పద మృతి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఈ రూపం.. అపురూపం

● ఆకట్టుకున్న కవలల ప్రదర్శనలు
● కవల పిల్లల ఇల్లు స్వర్గం : గజల్ శ్రీనివాస్



సభలో మాట్లాడుతున్న గజల్ శ్రీనివాస్, వేదికపై రామచంద్రరాజు, డాక్టర్ నాగార్జున తదితరులు





ప్రదర్శనలో పాల్గొన్న కవలలు

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): వారి రూపం అపురూపం.. ఒకే గర్భం నుంచి కలిసి జన్మిస్తారు... వారి చూడాలంటే రెండు కళ్ల సరిపోవు... అచ్చు గుద్దినట్లు ఒకేలా ఉండే వారిని చూసి తల్లిదండ్రులు, ఇరుగుపొరుగు వారు మురిసి పోతుంటారు. ఒకే రకమైన దుస్తులు, వస్తువులు కొనిపెట్టి అపురూపంగా చూసుకుంటారు. ఇటువంటి సందడిని ఒక చోట చేరిస్తే మరింత ఆహ్లాదం వస్తుంది. దీనిని దృష్టిలో పెట్టుకుని కవలల దినోత్సవం సందర్భంగా శనివారం గుంటూరు భారతీయ విద్యాభవన్ ప్రాంగణంలో విద్యాభవన్స్ శ్రేష్ఠ ఆస్పత్రి సంయుక్త ఆధ్వర్యంలో శనివారం కవలలు ప్రదర్శన నిర్వహించారు. అధునాతన ఫ్యాషన్ వస్త్రధారణలతో పాటు వారిలో ఉన్న వివిధ కళల ప్రదర్శన జరిగింది. కవలలు ఏక రూపంలో ఉంటూ, ఏక వస్త్ర ధారణతో చూపరులను ఆకట్టుకుంది. ముఖ్యఅతిథిగా హాజరైన ప్రముఖ గజల్ గాయకుడు గజల్ శ్రీనివాస్ మాట్లాడుతూ కవల పిల్లలు ఉన్న ఇల్లు స్వర్గంతో సమానమని, వారిని చూస్తే మనసుకు ఎంతో ఆహ్లాదం కలుగుతుందని అన్నారు. పోటీల నిర్వాహకులు పీ రామచంద్ర రాజు మాట్లాడుతూ ట్విన్స్ పోటీలు ఎక్కువగా పాశ్చాత్య దేశాల్లో నిర్వహిస్తూ ఉంటారని, అటువంటి పోటీలను మన నగరంలో నిర్వహించాలనే ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఒకే వేదికపై ఇంత మంది కవలలను చూడటం, వారిలోని నైపుణ్యాలను ఈ వేదికపై ప్రదర్శిం చటం ఆనందంగా ఉందని తెలిపారు. అనంతరం ప్రదర్శనలలో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో శ్రేష్ఠ ఆస్పత్రి ఎండీ గొట్టిపాటి నాగార్జున, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఘనంగా సీతారామయ్య హైస్కూల్లో....

గుంటూరు కార్పొరేషన్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): స్థానిక లక్ష్మీపురం మెయిన్ రోడ్ లోని శ్రీపాటిబండ్ల సీతారామయ్య హైస్కూల్లో ప్రపంచ కవలల దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. సందర్భంగా పాఠశాల సెక్రటరీ పాటిబండ్ల విష్ణువర్ధన్ మాట్లా డుతూ ప్రతి ఏడాది ఫిబ్రవరి 22న ప్రపంచ కవలల దినోత్సవాన్ని జరుపుకుంటామ న్నారు. పోలెండ్ దేశంలో 1976లో మొదటిసారిగా కవలల దినోత్సవాన్ని నిర్వహించారనీ అన్నారు. తమ పాఠశాలలోని 30 మంది కవల విద్యార్థులకు మిఠాయిలు పంచారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కమిటీ సభ్యులు గింజుపల్లి వరప్రసాదరావు, అకడమిక్ డైరెక్టర్ లేళ్ల కృష్ణవేణి, ప్రిన్సిపాల్ జంపని పద్మజ, ప్రైమరీ ప్రిన్సిపాల్ కర్లపూడి పార్వతీదేవి, కోఆర్డినేటర్స్ దుర్గాశ్యాం, శ్రీదేవి పాల్గొన్నారు.



కవలల విద్యార్థులతో సీతారామయ్య హైస్కూల్ అధ్యాపకులు, యాజమాన్యం

ఆలపాటికి విజయ తిలకం దిద్దుదాం

● ఎమ్మెల్యేలు ఆనంద్‌బాబు, నసీర్, ఎమ్మెల్సీ అశోక్‌బాబు ప్రచారం



బ్యాలెట్ నమూనాను చూపుతున్న కూటమి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ, టీడీపీ నేతలు

గుంటూరు, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): ఎనిమిది నెలల క్రితం ఓటు అనే ఆయుధంతో కూటమి ప్రభుత్వానికి తిరుగులేని విజయాన్ని కట్టబెట్టిన గుంటూరు ప్రజలు, మరో సారి ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆలపాటికి విజయతిలకం దిద్దేందుకు సిద్ధంగా ఉన్నారని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం నియోజకవర్గంలోని అర్బన్ ప్రైవేటు స్కూల్స్ అసోసియేషన్ ఆత్మీయ సమావేశానికి ఎమ్మెల్యే నసీర్, మాజీ మంత్రి, వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనంద్‌బాబు, ఎమ్మెల్సీ అశోక్ బాబు, ఎన్నికల పరిశీలకుడు నూకసాని బాలాజీ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మె ల్యే నసీర్ మాట్లాడుతూ విద్యాసంస్థల నుంచి డిగ్రీలు చేతపట్టుకుని ఉద్యోగాల వేటకు బయలుదేరిన నిరుద్యోగులకు నేనున్నానంటూ ఒక విజన్‌తో పారిశ్రామిక విప్లవానికి సీఎం చంద్రబాబునాయుడు బాటలు పరిచారని అన్నారు. సీఎం చంద్రబాబునాయుడు ఆధ్వ ర్యంలో కూటమి ప్రభుత్వం బలపరిచిన పట్టభద్రుల నియోజకవర్గం నుంచి ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తోన్న ఆలపాటి రాజాను గెలిపించుకుంటే బిడ్డల భవిష్యత్తు బాగుం టుందని తెలిపారు. మాజీ మంత్రి నక్కా ఆనంద్‌బాబు మాట్లాడుతూ మాజీ మంత్రి ఆలపాటి రాజా గెలుపు ద్వారా గుంటూరు జిల్లా సత్తా ఏంటో ప్రతిపక్షాలకు మరోసారి తెలియజేయాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ అశోక్‌బాబు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో ఉద్యోగులకు మంచి జరుగుతుందని, దానికి కొనసాగింపుగా ఎమ్మె ల్సీ ఎన్నికల్లో ఆలపాటిని గెలిపించుకుందామని కోరారు. నూకసాని బాలాజీ మాట్లాడుతూ కేవలం ఎనిమిది నెలల వ్యవధిలో రాష్ట్రంలో అనూహ్యమైన ప్రగతి కనిపిస్తోందని తెలి పారు. కార్యక్రమంలో గుంటూరు అర్బన్ ప్రైవేట్ స్కూల్స్ కరస్పాండెంట్లు, డైరెక్టర్లు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆలపాటిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలి : కోవెలమూడి

గుంటూరు, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కృష్ణ-గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి తరపున పోటీ చేస్తున్న మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని టీడీపీ జోన్- 5 ఇన్‌చార్జి కోవెలమూడి రవీంద్ర కోరారు. గుంటూరులోని ఎన్టీఆర్ మున్సిపల్ స్టేడియంలో శనివా రం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. స్టేడియానికి వచ్చే వాకర్స్, ఇతర క్రీడాకారుల తో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను వారికి వివరించారు. విద్యావంతులు వివేకంతో ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని, ప్రజల మనిషిగా పేరున్న రాజాకు తమ తొలి ప్రాధాన్య ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో లాల్ వజీర్, కసుకుర్తి హనుమంతరావు, పానకాల వెంకట మహాలక్ష్మి, ఉప్పటూరి పేరయ్య, కొనికె వినోద్, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



ఎన్టీఆర్ స్టేడియంలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం చేస్తున్న నాని, టీడీపీ నేతలు

ఆలపాటితోనే ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతి

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాదుతోనే ఎస్సీ, ఎస్టీ పట్టభద్రుల అభ్యున్నతి సాధ్యమవుతుందని మాల మహానాడు రాష్ట్ర కన్వీనర్ కొర్రపాటి సురేష్, యానాది హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్య క్షుడు తిరువీధుల శంకర్ ప్రసాద్ అన్నారు. అరండల్‌పేటలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఆయన విద్యాసంస్థల ద్వారా ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీలకు ఉన్నత విద్యను అందిస్తున్నారని గుర్తుచేశారు. శాసనమండలిలో ఆల పాటి ఉంటే అణగారిన వర్గాలకు మేలు జరుగుతుందని తెలిపారు. దీనికి దృష్టిలో పెట్టు కుని ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ పట్టభద్రులు కలిసి తొలి ప్రాధాన్య ఓటు ఆలపాటికి వేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘ నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ నిర్దేశిత కార్యక్రమాలను పక్కాగా అమలుచేయాలి : కమిషనర్

గుంటూరు కార్పొరేషన్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిర్దేశిత కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో వార్డ్ సచివాలయాల వారీగా పక్కాగా అమలు చేయడానికి వార్డు అడ్మిన్ కార్యదర్శి నేతృత్వంలో కార్యదర్శులందరూ సమన్వయంతో కృషి చేయాలని, కేటాయించిన విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు సచివాలయ కార్యదర్శులు, నోడల్ అధికారులను ఆదేశించారు. శనివారం స్థానిక శ్రీవెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో వార్డు సచివాలయ కార్యదర్శులు, నోడల్ అధికా రులతో ప్రభుత్వ కార్యక్రమాల అమలు, వివిధ సర్వేల పురోగతిపై సమావేశం నిర్వహించా రు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు క్షేత్ర స్థాయిలో ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాల విజయవంతానికి సచివాలయ కార్యదర్శులు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ఆయా కార్యక్రమాల పర్యవేక్షణ కోసం డివిజన్ల వారీగా నియమిం చిన నోడల్ అధికారులు పర్యవేక్షణ బాధ్యతలు పగడ్బందీగా నిర్వహించాలన్నారు. సమా వేశంలో అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డిప్యూటీ కమిషనర్లు డి.శ్రీనివాసరావు, పి.శ్రీనివాసరావు, సీహెచ్ శ్రీనివాస్, టి.వెంకటకృష్ణయ్య, సీఎంవోహెచ్ డాక్టర్ అమృతం, ఎం హెచ్‌ఓ డాక్టర్ రవిబాబు, ఉపా సెల్ పీవో రామారావు, గుంటూరు తూర్పు, పశ్చిమ తహసీల్దార్లు, నోడల్ అధికారులు, సచివాలయాల కార్యదర్శులు పాల్గొన్నారు.



వడ్డే శోభనాద్రీశ్వరరావుకు ధర్మజ్యోతి పురస్కారం అందజేస్తున్న డాక్టర్ యలమంచిలి శివాజీ, నన్నపనేని రాజకుమారి తదితరులు

రైతుల పక్షపాతి.. వడ్డే శోభనాద్రీశ్వరరావు

● మాజీ ఎంపీ యలమంచిలి శివాజీ
● ఘనంగా ధర్మజ్యోతి పురస్కార వేడుక

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ రంగంలో నెలకొన్న సమస్యలపై నిరంతరం పోరాటం చేసిన గొప్పవ్యక్తి వడ్డే శోభనాద్రీశ్వరరావు అని మాజీ ఎంపీ యలమంచిలి శివాజీ కొనియాడారు. స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై స్వధర్మ సేవాసంస్థ ఆధ్వర్యంలో శని వారం మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు ధర్మజ్యోతి 2025 పురస్కార ప్రదానోత్సవ సభ శనివారం ఘనంగా జరిగింది. సభకు సంస్థ అధ్యక్షుడు కొర్రపాటి రామారావు అధ్య క్షత వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన యలమంచిలి శివాజీ మాట్లాడుతూ పంజాబ్ లో అప్నెమండి వ్యవస్థ గురించి నాటి ముఖ్యమంత్రి చంద్రబాబుకు చెప్పి రైతు బజార్లు ఏర్పాటులో వడ్డే శోభనాద్రీశ్వరరావు చేసిన కృషి మరవులేనిదన్నారు. మరో అతిథి నన్నప నేని రాజకుమారి మాట్లాడుతూ రెండుసార్లు ఎంపీ, ఎమ్మెల్యే, ఉమ్మడి రాష్ట్ర వ్యవ సాయ శాఖ మంత్రిగా రాష్ట్రానికి ఆయన చేసిన సేవలు గొప్పవని అన్నారు. అనంతరం ఆలయ కమిటీ అధ్యక్షుడు మస్తానయ్య, అన్నమయ్య గ్రంథాలయం వ్యవస్థాపకుడు సూర్యనారా యణ, డాక్టర్ మద్దినేని గోపాలకృష్ణ, భారతీ ధార్మిక విజ్ఞాన పరిషత్ బొల్లేపల్లి సత్యనారా యణ, కన్నెగంటి బుచ్చయ్య చౌదరి, సంస్థ కార్యదర్శి తూనుగుంట్ల సుందరరామయ్యలతో కలసి శోభనాద్రీశ్వరరావును ధర్మజ్యోతి పురస్కారంతో సత్కరించారు.

బ్యాంకుల ప్రైవేటీకరణను తిప్పికొట్టాలి

● సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణ



మాట్లాడుతున్న రామకృష్ణ, పాల్గొన్న బ్యాంకు ఎంప్లాయిస్ యూని యన్ సభ్యులు

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ బ్యాంకులను ప్రైవేటీకరణ చేయాలనే కేంద్ర ప్రభుత్వ ప్రయత్నాలను తిప్పికొట్టాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే రామ కృష్ణ పిలుపునిచ్చారు. గుంటూరులో రెండు రోజులు పాటు జరిగే ఇండియన్ బ్యాంకు ఎం ప్లాయిస్ యూనియన్ (ఆంధ్రా, తెలంగాణ) వర్కింగ్ కమిటీ సమావేశాలను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వ బ్యాంకింగ్ రంగంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికై మార్చి 24, 25 తేదీల్లో జరిగే సమ్మెకు పూర్తి మద్దతు తెలుపుతున్నట్టు పేర్కొన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌తో సహా అన్ని ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్లకు కట్టబెట్టాలని చూస్తున్న కేంద్ర వైఖరిని ఖండిస్తున్నట్టు స్పష్టం చేశారు. ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి పీవీ కృష్ణారావు మాట్లాడుతూ బ్యాం కుల్లో సిబ్బందిని తగ్గించడం అంటే సేవలను కూడా తగ్గించడమేనని అభిప్రాయపడ్డారు. ఔట్‌సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న ఉద్యోగులు బోనస్‌లు కోల్పోతు న్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

కేవీపీ కాలనీలో ఇద్దరిపై వీధి కుక్కల దాడి

● ఓ బాలుడి చేతిపై గాయాలు.. జీజీహెచ్‌కు తరలింపు



జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న బాలుడు

గుంటూరు, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): నగర శివారు కొండా వెంకటప్పయ్య కాలనీలో వీధికుక్కలు రెచ్చిపోయాయి. ఇంటి ముందు ఆడుకుంటున్న ఓ బాలుడిపై మూడు కుక్క లు దాడి చేశాయి. అడ్డుకోబోయిన మరో యువకుడిపై కూడా దాడి చేయటం స్థానికుల ను భయాందోళనకు గురిచేసింది. కొండా వెంకటప్పయ్యకాలనీ రెండో లైనులో జునైద్ అహ్మద్ అనే ఐదేళ్ల బాలుడు ఇంటి ముందు ఆడుకుంటుండగా మూడు వీధి కుక్కలు ఒక్కసారిగా దాడి చేశాయి. బాలుడిపై పడి లాక్కెళుతుండ టంతో స్థానికులు అడ్డుకోబోయారు దీంతో మరో యువకుడిపై దాడి చేశాయి. బాలుడు చేతికి గాయాలయ్యాయి. రక్తస్రావంతో ఉన్న బాలుడిని కుటుంబసభ్యులు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వీధి కుక్కలను నియంత్రిం చకుంటే త్వరలో నగరపాలక సంస్థ ఎదుట ధర్నా చేస్తామని ఆర్‌టీఐ కార్యకర్త షేక్ బాజీ హెచ్చరించారు.

మౌలానా అబుల్ కలాం సేవలు చిరస్మరణీయం : ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): భారత స్వాతంత్ర్య సమరయోధుడు, విద్యావేత్త మౌలానా అబుల్ కలాం సేవలు చిరస్మరణీయమని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహ మ్మద్ నసీర్ అన్నారు. అబుల్ కలాం వర్ధంతి సందర్భంగా శనివారం నియోజకవర్గంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో నసీర్, టీడీపీ నేతలు ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భారతదేశానికి తొలి విద్యాశాఖ మంత్రిగా అనేక సేవలు అందించారని తెలిపారు. భారతదేశంలో హిందూ- ముస్లిం ఐక్యత కోసం కృషి చేశారని, నేటి యువత అబుల్ కలాంను ఆదర్శంగా తీసుకో వాలని సూచించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఎల్లావుల అశోక్, గింజాం రాఘవేంద్ర, పటాన్ జమీర్ ఖాన్, రఫీ, ఉస్మాన్, అన్వర్, హఫీజ్, చిలుకా వెంకటేశ్వర్లు, అల్లం బాజీ, వంగర ఏడుకొండలు, గొల్ల ప్రభాకర్, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు ఆలపాటి గెలుపునకు తోడ్పడాలి : శేషయ్య



మాట్లాడుతున్న శేషయ్య

గుంటూరు, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఉపాధ్యాయులంతా తమ తొలి ప్రా ధాన్య ఓటును మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు వేసి అత్యధిక మెజార్టీతో గెలి పించాలని టీడీపీ నాయకుడు నిమ్మల శేషయ్య కోరారు. గుజ్జనగుండ్లలోని తన కార్యాల యంలో శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. నిరుద్యోగులు, పట్టభద్రులకు ఇచ్చిన అన్ని హామీలను నేరవేర్చేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. నిరుద్యోగ యువత ఉపాధి కల్పనకు ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత 16,347 పోస్టులతో మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేస్తామని అన్నారు. పరిశ్రమలను తీసుకొచ్చి రానున్న 7 నెలల్లో దాదాపు 4 లక్షల ఉద్యోగావకాశాలు కల్పిస్తామన్నారు. ఉపాధ్యాయులపై యాప్ భారాన్ని తగ్గిస్తామని, విద్యారంగంలో అల్లకల్లోలం సృష్టించిన జీవో 117ని రద్దు చేస్తామని తెలిపారు. ఖాళీగా ఉన్న 3,500 అధ్యాపక, అధ్యాపకేతర పోస్టులు భర్తీ చేస్తామని.. ఉపాధ్యాయుల ప్రమోషన్లు, బదిలీలు త్వరగా పూర్తి చేస్తామని చెప్పారు. వైసీపీ అనాగరిక పాలనలో మండలిసభలో మూడు రాజధానుల బిల్లుల విషయంలో మండలి చైర్మన్ షరీఫ్‌ను ఇబ్బంది పెట్టి, అనుచిత వ్యాఖ్యలు చేస్తుంటే కనీసం స్పందించకుండా, మాట్లాడ కుండా సిఖండి పాత్ర పోషించి, వాళ్ళ అరాచకాలకు ఎమ్మెల్సీ అభ్యర్థి లక్ష్మణరావు వంత పాడారని శేషయ్య విమర్శించారు. ఉపాధ్యాయులను మద్యం దుకాణాల వద్ద కాపలా పెడితే ఆయన కనీసం ప్రభుత్వాన్ని ప్రశ్నించలేదని గుర్తుచేశారు. ఉపాధ్యాయులు కూట మి ప్రభుత్వానికి అండగా నిలవాలని విన్నవించారు. కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు కోపూరి వెంకటరమణ, కుమార్, శంకర్ పాల్గొన్నారు.

ఈవీఎం గోడౌన్ల తనిఖీ



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

గుంటూరు (తూర్పు) ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు నెల వారి తనిఖీల్లో భాగంగా శనివారం కలక్టరేట్ ఆవరణలోని ఈవీఎంలు భద్రపరిచిన గోడౌన్‌ను కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి తనిఖీ చేశారు. సీసీ టీవీ పనితీరు, అగ్నిమా పక పరికరాలను, సిబ్బంది లాగ్ బుక్‌ను పరిశీలించారు. అగ్నిమాపక పరికరాలపై కాల పరిమితి ముగుస్తున్న నేపథ్యంలో తగు చర్యలు తీసుకోవాలని డీఎఫ్‌వోను శ్రీనివాసరెడ్డిని ఆమె ఆదేశించారు.. కార్యక్రమంలో డీఆర్వో షేక్ ఖాజావలి, ఆర్డీవో కే.శ్రీనివాసరావు, పశ్చిమ తహసీల్దారు వెంకటేశ్వర్లు ఆర్‌అండ్‌బీ డీఈఈ రవీంద్రరెడ్డి, కలెక్టరేట్ హెచ్ సెక్షన్ పర్యవేక్షకులు మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటర్లంతా ఓటు హక్కు వినియోగించుకోవాలి

● జాయింట్ కలెక్టర్ భార్గవ తేజ



ప్రతిజ్ఞ చేయిస్తున్న జేసీ భార్గవ్ తేజ

గుంటూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కృష్ణా - గుంటూరు జిల్లా పట్టభద్రుల నియోజకవర్గ శాసనమండలికి ఫిబ్రవరి 27వ తేదీన జరిగే పోలింగ్‌లో ఓటరుగా నమోదు చేసుకున్న ప్రతి పట్టభద్రుడు తప్పక ఓటును వేసి సద్వినియోగపరచుకోవాలని జాయింట్ కలెక్టర్ ఏ భార్గవ్ తేజ కోరారు. శనివారం ఓటర్ల అవగాహన కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన స్వీప్ ర్యాలీని కలక్టరేట్ నుంచి జేసీ భార్గవ్ తేజ, నగర కమిషనర్ పులి శ్రీనివాసులులతో కలసి జెండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీ కలక్టరేట్ నుంచి హిందూ కళాశాల వరకు జరిగింది. ర్యాలీ ముగింపు సందర్భంగా జేసీ అందరితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటరు ముందుగా తన ఓటు నమోదైనట్లుగా తెలుసుకోవడంతో పాటు పోలింగ్‌స్టేషన్ వివరాలపై అవగాహన కలిగి ఉండి పోలింగ్ రోజున తప్పక ఓటు వేయాలన్నారు. కమిషనర్ పులి శ్రీనివాసులు మాట్లాడుతూ ఓటరు తన ఓటు నమోదు వివరాల ను కనుగొని ఏ బూత్‌లో తన ఓటు ఉందో సరి చూసుకోవాలన్నారు. ఓటర్ల సహాయార్థం ఓటరు ఫెసిలిటీ సెంటర్లను కూడా ఏర్పాటు చేసినందున వాటిని ఉపయోగించుకోవాలన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి షేక్ ఖాజావలి మాట్లాడు తూ ఓటరుగా నమోదైన ప్రతి ఒక్కరూ ఓటును వినియోగించుకోవాలన్నారు. ర్యాలీలో గుంటూరు రెవెన్యూ డివిజన్ అధికారి శ్రీనివాసరావు, జీఎంసీ అదనపు కమిషనర్ ఓబు లేశు, డిప్యూటీ కమిషనర్లు బీ శ్రీనివాసరావు, వెంకట కృష్ణయ్య, సీహెచ్ శ్రీనివాస్, జిల్లా ఉపాధి కల్పన అధికారి దుర్గాబాయి డీఎస్‌డీవో సంజీవరావు, ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు పాల్గొన్నారు.

సమష్టి కృషితోనే సుందర చల్లపల్లి సాధించగలిగాం

● డాక్టర్ డీఆర్‌కే ప్రసాద్



ప్రసంగిస్తున్న డాక్టర్ డీఆర్‌కే ప్రసాద్

గుంటూరు కార్పొరేషన్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ సుందర చల్లపల్లి అందరి విజయమని, స్వచ్ఛందసేవకుల శ్రమ, సమయ దానాలతోనే ఈ ఘనత సాధ్యమైందని స్వచ్ఛ సుందర చల్లపల్లి శ్రమదాన ఉద్యమ వ్యవస్థాపకుడు డాక్టర్ డీఆర్‌కే ప్రసాద్ పేర్కొ న్నారు. శనివారం జన చైతన్య వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన 'స్వచ్ఛ సుందర చల్లపల్లి - ఉద్యమ అనుభవాలను పంచుకుందాం' కార్యక్రమానికి జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి అధ్యక్షత వహించారు. ప్రధాన వక్తగా హాజరైన డీఆర్‌కే ప్రసాద్ ప్రసంగిస్తూ విశ్రాంత ఉద్యో గులు, మహిళలు, విద్యార్థులు, గ్రామస్థులతో కలిసి ఏర్పాటైన 'మనకోసం మనం ట్రస్ట్' బృంద సభ్యులు దాదాపు 200 మంది చేస్తున్నది సేవ కాదు బాధ్యత అని భావిస్తూ సం తోషాన్ని పొందుతున్నట్టు తెలిపారు.

సభకు అధ్యక్షత వహించిన వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ మనకోసం మనం ట్రస్ట్ సభ్యులను ఆదర్శంగా తీసుకొని ఎవరికి వారు తమ వీధులను, గ్రామాలను, పట్టణాలను పరిశుభ్రంగా ఉంచుకుంటూ పచ్చదనంతో నింపాలని పిలుపునిచ్చారు. కార్మెల్ సేవా సదన్ వ్యవస్థాపకుడు జాక్ క్లమాకస్ ప్రసంగిస్తూ దాతలు అందించే ఆర్థిక సాయంతో పాటు స్వచ్ఛంద సంస్థలలో స్వయంగా సభ్యులుగా చేరి నిరాశ్రయులకు, నిర్భాగ్యులకు ప్రేమతోసేవలందించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మానవత అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీనివాసరావు, కోవిడ్ ఫైటర్స్ వ్యవస్థాపకులు అల్లాబక్షు, నేస్తం సహ వ్యవస్థాపకులు టి.ధనుంజయరెడ్డి, స్టెప్ నేత ఆత్మకూరి ధర్మారెడ్డి, దళిత బహుజన ఫ్రంట్ వ్యవస్థాపకుడు కొరివి వినయ్‌కుమార్, రుద్ర చారిటబుల్ ట్రస్ట్ సుభాని పాల్గొన్నారు.

విద్యుత్‌శాఖలో పలువురు అధికారులకు ఉద్యోగోన్నతి

● ఆరుగురు ఈఈలకు ఎస్ఈలుగా, డిప్యూటీ ఈఈలకు, ఏఈలకు కూడా పదోన్నతి

గుంటూరు, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ లిమిటెడ్‌లో (ఏపీ సీపీడీసీఎల్) ఆపరేషన్ విభాగంలో పలువురు అధికారులకు ఉద్యోగోన్నతి కల్పిస్తూ సీఎండీ (ఎఫ్ఏసీ) ఏకేవీ భాస్కర్ శనివారం రాత్రి ఆదేశాలు జారీ చేశారు. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు (ఈఈ)గా వ్యవహరిస్తున్న కేవీఎల్ఎన్ మూర్తి, కే వెంకటేశ్వర్లు, జీ ఆంజనేయులు, ఎం శ్రీనివాసరావు, శ్రీనివాసులరెడ్డి, రమేష్‌బాబుకు సూపరింటెండెంట్ ఇంజనీర్లు (ఎస్ఈ)లుగా పదోన్నతి కల్పించారు. అలానే సీపీడీసీఎల్‌లో మరో ఆరుగురు డిప్యూటీ ఈఈలను ఈఈలుగా, మరో ఆరుగురు ఏఈలను డిప్యూటీ ఈఈలుగా పదోన్నతి కల్పిస్తూ ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం ఎస్ఈలుగా పదోన్నతి పొందిన వారు గుం టూరు సర్కిల్ టెక్నికల్ ఈఈగా ఉన్న కేవీఎల్ఎన్ మూర్తి సర్కిల్ ఆపరేషన్ ఇన్‌చార్జ్ ఎస్ఈగా వ్యవహరిస్తున్నారు. సీహెచ్ రమేష్‌బాబు (గుంటూరు టౌన్-2), కే.వెంకటేశ్వర్లు (ఒంగోలు ఇన్‌చార్జ్ ఎస్ఈ), శ్రీనివాసులరెడ్డి (పల్నాడు ఎంఆర్‌టీ), జీ ఆంజనేయులు (బాపట్ల, ఇన్‌చార్జ్ ఎస్ఈ) ఎం శ్రీనివాసరావు (కన్‌స్ట్రక్షన్స్ ఈఈ)లుగా వ్యవహరిస్తు న్నారు. అయితే వారికి పోస్టింగ్‌లు ఎక్కడనేది త్వరలోనే ప్రకటించనున్నట్లు తెలిసింది.


ఆనందం.. ఆకర్షణీయం!

- నెమళ్ల నృత్యం.. చెంగు చెంగున జింకలు
- ఆహ్లాదంగా నగరవనాలు
- యాత్రికులకు ఫిదా చేస్తున్న పర్యాటక కేంద్రం



ఘాట్ రోడ్డులో విష్ణుమూర్తి విగ్రహం

(కోటప్పకొండ/నరసరావుపేట, ఆంధ్రజ్యోతి) కోటప్పకొండ ఘాట్ రోడ్డులోని పర్యాటక కేంద్రం యాత్రికులను ఫిదా చేస్తుంది. యాత్రికులకు నయనానందాన్ని కలిగిస్తుంది. తిరునాళ్లకు పర్యాటక కేంద్రాన్ని ముస్తాబు చేస్తున్నారు. ఉద్యానవనాలు, వన్య ప్రాణులతో శోభిల్లుతుంది. చిన్నారుల ఆటలు, ఆనందం కోసం పిల్లల రాజ్యం పార్కును ఏర్పాటు చేశారు. రంగు రంగుల చేపలతో నీటి కొలను, అక్వేరియంలు ఆకట్టుకుంటు న్నాయి. శ్వేత నెమలి నృత్యం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది. నెమలి వనంలో నెమళ్ల నృత్యాలు కనువిందు చేస్తున్నాయి. లవ్ బర్డ్స్, రామ చిలుకలు, పావురాళ్లు, ఎర్రకాళ్ల కొంగలు, బాతులు, ట్రాయ్ ట్రెయిన్, నీటి పక్షులు, జింకలు, కణుతులు, మనుబోతులు, దుప్పులు, వివిధ రకాల విదేశీ పక్షులు యాత్రికులను ఆకట్టుకుంటున్నాయి. కాళింది మడుగులో బోట్ షికారు కల్పిస్తున్నారు. పర్యాటక కేంద్రాన్ని ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. అటవీ శాఖ ఘాట్ రోడ్డుకు ఇరువైపులా పెంచిన పూల మొక్కలు ఆకట్టుకుంటున్నాయి. కోటప్పకొండ పెట్లూరివారి పాలెం మార్గంలో, గిరి ప్రదక్షిణ మార్గంలో నగరవనాలు యాత్రికులను ఆకట్టుకుంటున్నాయి. ఘాట్ రోడ్డు మార్గంలో చతుర్ముఖ బ్రహ్మ, శేష శయనంపై విష్ణుమూర్తి, కాళింది మడుగులో తాండవ కృష్ణుడు విగ్రహాలు భక్తులను ఆకట్టుకుంటున్నాయి.



కాళింది మడుగులో కృష్ణుని విగ్రహం



గణనీయంగా పెరిగిన జింకల సంఖ్య

పర్యాటక కేంద్రంలో జింకల పార్కును 1999లో నాటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రారంభించారు. ప్రారంభంలో 20 దుప్పులు, జింకలతో పార్కును ఏర్పాటు చేశారు. ప్రస్తుతం జింకల సంఖ్య గణనీయంగా పెరిగింది. వీటి సంఖ్య 150కి చేరింది. వన్య ప్రాణుల సంరక్షణలో అటవీ శాఖ అన్ని చర్యలు తీసుకుంటుంది. ఇంకా కృష్ణ జింకలు, మనుబోతులు ఉన్నాయి.



పర్యాటక కేంద్రంలో నెమలి నృత్యం

ఆకట్టుకుంటున్న నగర వనాలు

కోటప్పకొండలో ఏర్పాటు చేసిన నగరవనం యాత్రికులను ఆకట్టుకుంటుంది. ఆహ్లాదం.. సాహసం.. వినోదం కలగలిపి నగరవనాలను నిర్మించారు. ఇక్కడి నిర్మాణాలు ఆకట్టుకుంటున్నాయి. తాటి కలపతో నిర్మించిన స్వాగత ద్వారం, గుడిసెలు ఆకర్షిస్తున్నాయి. కోటప్పకొండ గిరి ప్రదక్షిణ మార్గంలో నగరవనం, గిరివన విహార్, గిరి బాల విహార్ పేర్లతో ఉద్యానవనాలు రూపుదిద్దుకున్నాయి. గిరివన విహార్‌లో నాగవల్లి వివిధ మొక్కలను పెంచుతున్నారు. చిన్నారుల కోసం ఆట వస్తులతో ప్రత్యేక పార్కు.. సాహస క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేశారు. పెట్లూరివారిపాలెం - కోటప్పకొండ మార్గంలో నగరవనం రూపుదిద్దుకుంది. కొండ వెనుక ప్రాంతంలో పండ్ల.. పూల మొక్కలతో వనాలను పెంచుతున్నారు. అటవీ శాఖ ఆధ్వర్యంలో ఈ వనాలు రూపుదిద్దుకున్నాయి. వీటిని కేంద్రీయ నగర వన యోజన పథకం కింద అటవీ శాఖ చేపట్టింది.



ఘాట్ రోడ్డులో చతుర్ముఖ బ్రహ్మ విగ్రహం



పెట్లూరివారి రహదారిలో నిర్మించిన నగరవనం



అక్వేరియంలో రంగురంగుల చేపలు

నైపుణ్యాభివృద్ధిలో శిక్షణ

యువతకు ఉపాధి, ఉద్యోగావకాశాలు కల్పించేందుకు..

తుళ్లూరు సీఆర్డీఏకు రూ.40 లక్షల మెటీరియల్ రాక

తుళ్లూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి నిర్మాణానికి భూములివ్వటంతో వ్యవసాయ పనుల్లేక ఉపాధి సన్నగిల్లింది. దీనికితోడు వైసీపీ ప్రభుత్వంలో రాజధాని నిర్మాణ పనులు పూర్తిగా నిలిపేశారు. ఉపాధి కోసం బయట ప్రాంతానికి స్థానికులు వలసపోయారు. దీనిని గమనించిన కూటమి ప్ర భుత్వం రాజధాని 29 గ్రామాలలో అర్హత ఉన్న వారికి వృత్తి నైపుణ్యంలో శిక్షణ ఇవ్వడానికి సిద్ధమైంది. ఫుడ్ ప్రాసెసింగ్, ఎలక్ట్రికల్, ఏసీ మెకానిజం, జ్యూట్ బ్యాగుల తయారి, ల్యాండ్ స్కేపింగ్, టెక్స్ టైల్స్, టైలరింగ్ వంటి రంగాలలో శిక్షణనిచ్చి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించటానికి సీఆర్డీఏ సన్నద్ధమైంది. ఇప్పటికే తుళ్లూరు సీఆర్డీఏ ప్రాంతీయ కార్యాలయంలో ఆయా కోర్సుల్లో శిక్షణను ప్రారంభించారు. శిక్షణకు అ ర్హులైన వారు దరాఖాస్తు చేసుకోవాలని సీఆర్డీఏ సోషల్ వెల్ఫేర్ అధికారి బొర్రా శ్రీనివాసరావు సూచిస్తున్నారు.



సీఆర్డీఏ కార్యాలయంలో నైపుణ్యాభివృద్ధి పై శిక్షణ

ప్రథమ పౌరులుగా గుర్తించి...

రాజధాని 29 గ్రామాలలో 2024 డిసెంబరు 8వ తేదీ లోపు నివాసం ఉంటున్న వారిని గత టీడీపీ ప్రభుత్వం ప్రథమ పౌరులుగా గుర్తించి ఉచిత వైద్య సేవలు అందించటానికి ఆరోగ్యశ్రీ కార్డులే కాకుండా ప్రత్యేక వైద్యం అందించటానికి హెల్త్ కార్డులు జారీ చేసింది. అంతేకాకుండా నైపుణ్యాభివృద్ధిలో శిక్షణనిచ్చి ఉపాధి అవకాశాలు కల్పించింది. రాజధాని మొదటి పౌరులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించటానికి సీఆర్డీఏ చర్యలు తీసుకుంటుంది. రాజధాని నిర్మాణ పనులు నిమిత్తం పలు అంతర్జాతీయ కంపెనీలు అమరావతిలో కొలువు తీరబోతున్నాయి. ఆయా కంపెనీల్లో యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడానికి తుళ్లూరు సీఆర్డీఏ ప్రాంతీయ కార్యాలయంలో శిక్షణ ఇస్తున్నారు. అందుకు అవసరమైన రూ.40 లక్షల విలువైన వస్తు సామగ్రి సైగర్ కంపెనీ నుంచి సీఆర్డీఏ కార్యాలయానికి వచ్చాయి.



ఆలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన క్యూలు

నేటి నుంచి వైభవంగా బ్రహ్మోత్సవాలు

పెదకాకాని, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): పెదకాకాని మల్లేశ్వర స్వామి వారి దేవస్థానంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు నేటి నుంచి మార్చి ఒకటి వరకు అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో గోగినేని లీలా కుమార్ తెలిపారు. ప్రతిరోజూ స్వామివారికి అమ్మవార్లకు అభిషేకాలు జరిపించనున్నట్లు తెలిపారు. ఈ నెల 26న మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఉదయం 4 గంటల నుంచి 7 గంటల వరకు మాత్రమే గర్భగుడిలో మూలవిరాట్‌కు అభిషేకాలు జరుగుతాయన్నారు. ఆ తర్వాత భక్తులకు స్వామివారి దర్శనం కల్పిస్తామన్నారు. 27న స్వామి, అమ్మవార్ల రథోత్సవం, 28న దేవస్థాన ఉత్తర భాగమున ఉన్న మంచినీటి చెరువులో తెప్పోత్సవం నిర్వహించనున్నట్లు వివరించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా మొదటి రోజు ఆదివారం శ్రీమల్లేశ్వర స్వామి వారు భ్రమరాంబ అమ్మవారు పెండ్లి కుమారునిగా, పెండ్లి కుమార్తెగా భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. భక్తులకు ఉచిత అన్నప్రసాద వితరణకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.



ప్రత్యేక అలంకరణలో మల్లేశ్వర స్వామి, భ్రమరాంబ అమ్మవారు

ఉట్టిపడుతున్న ఆధ్యాత్మిక శోభ

అమృతలూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ప్రసిద్ధి చెందిన శైవ క్షేత్రాల్లో ఒకటైన గోవాడ బాలకోటేశ్వరస్వామి ఆలయం దినదినాభివృద్ధి చెందుతుంది. ఎంతో పురాతన ఆలయం. ఫిబ్రవరి 24వ తేదీ నుంచి 28వ తేదీ వరకు ఉత్సవాలు జరగనున్నాయి. దాతల సహకారంతో ఆలయ ప్రాంగణంలో నూతన ఆలయాల ఏర్పాటుతో పాటు రాజగోపురం, అభిషేక మండపం, నూతన మందిరాలు నిర్మించారు. దీంతో ఆలయం వద్ద నూతన శోభ సంతరించుకుంది. ఆలయ ప్రాంగణంలో దక్షిణామూర్తి, మృత్యుంజయస్వామి విగ్రహాలను ఏర్పాటు చేశారు. ఆలయం చుట్టూ విఘ్నేశ్వర, ప్రసన్నాంజనేయ, సుబ్రహ్మణ్యేశ్వర, సాయిబాబా ఆలయాలను నిర్మించారు. దీంతో ఆలయ ప్రాంగణంలోకి ప్రవేశించగానే ఆధ్యాత్మిక శోభ ఉట్టిపడుతుంది. మహాశివరాత్రి పర్వదినం రోజున వేలాది సంఖ్యలో భక్తులు స్వామి దర్శనానికి రానున్నారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా క్యూలైన్‌లు పూర్తి చేశారు. దేవస్థానం ఎదుట చలువ పందిళ్లు వేశారు. అభిషేక మండపంలో ఒకేసారి 250 మంది దంపతులు కూర్చొని స్వామివారికి అభిషేకం చేసేలా ఏర్పాటు చేస్తున్నట్లు ఈవో తెలిపారు.



గోవాడ శ్రీబాలకోటేశ్వరస్వామి ఆలయం

ఉన్నత పాఠశాలల్లో స్కౌట్స్, గైడ్స్ యూనిట్లు

❖ పీఎంశ్రీ పథకంలో 600 పాఠశాలల ఎంపిక ❖ రూ.3 కోట్లు నిధులు విడుదల

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : మున్సిపల్, జిల్లా పరిషత్ ఉన్న త పాఠశాలల్లో స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్లను సిద్ధం చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పీఎంశ్రీ పథకంలో రాష్ట్రం నుంచి 600 పాఠశాలల్లో అమలు చేసేందుకు రూ.3 కోట్లు నిధులు విడుదల చేశారు. ఒక్కో పాఠశాలకు రూ.50 వేలు తొలి విడత అందించారు. ప్రతి పాఠశాల నుంచి ఒక పురుష, ఒక మహిళా ఉపాధ్యాయులకు ఏడు రోజుల బేసిక్ కోర్సు శిక్షణ ఇస్తున్నారు. తాడికొండలోని రెసిడెన్షియల్ స్కూల్‌లోని రీజనల్ ట్రైనింగ్ సెంటర్‌లో ఇప్పటికే మూడు బ్యాచ్‌లకు శిక్షణ పూర్తి చేశారు. యూనిఫాం కోసం రూ. 30 వేలు, శిక్షణ కోసం రూ. 20 వేలు వినియోగిస్తున్నారు. ప్రతి పాఠశాలలో 16 మంది బాలురు, 16 మంది బాలికలను ఎంపిక చేసి స్కౌట్స్ అండ్ గైడ్స్ శిక్షణ ఇవ్వాల్సి ఉంది. రానున్న విద్యా సంవత్సరం నుంచి ఆయా పాఠశాలల్లో యూనిట్లు ప్రారంభం కానున్నాయి. తొలి దశలో ఉపాధ్యాయుల ఎంపిక, శిక్షణ, ఒక్కో పాఠశాల నుంచి నలుగురు విద్యార్థుల ఎంపిక, శిక్షణ పూ ర్తి చేస్తారు. వీరంతా 32 మంది విద్యార్థులకు స్కౌట్ శిక్షణ అందిస్తారు. విద్యార్థుల్లో క్రమశిక్షణ, దేశభక్తి, విలువలు, మంచి పౌరునిగా ఎదగడం, ప్రథమ చికిత్స, లీడర్‌షిప్, సమాజం పట్ల అవగాహన, సామాజిక సేవా భావాలను పెంపొందించేందుకుగానూ కేంద్ర ప్రభుత్వం స్కౌట్స్ అండ్ గైడ్స్ ప్రవేశ పెట్టింది.



తాడికొండలో స్కౌట్స్ శిక్షణ పొందుతున్న ఉపాధ్యాయ బృందం

ఆసక్తి చూపని ఉపాధ్యాయులు...

స్కౌట్స్ శిక్షణ పొందేందుకు పలు పాఠశాలల్లో ఉపాధ్యాయులు ఆసక్తి చూపడం లేదు. దీంతో కేంద్ర ప్రభుత్వం ఆశించిన మేర పాఠశాలల్లో స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్లు ఏర్పాటు అయ్యేలా కనిపించడం లేదు. ప్రతి పాఠశాల నుంచి ఒక పురుష, ఒక మహిళ ఉపాధ్యాయురాలు బేసిక్ శిక్షణ పొంది విద్యార్థులను సిద్ధం చేయాల్సి ఉంటుంది. దీనికి ఆసక్తి ఉన్న ఉపాధ్యాయులు ముందుకు రావాలని చెప్పడంతో అధికభాగం పాఠశాలల్లో ఉపాధ్యాయులు శిక్షణ పొందేందుకు ముందుకు రావడం లేదు. యువ ఉపాధ్యాయులు ఉన్నప్పటికీ అదనపు భారంగా భావించి ఆసక్తి చూపడం లేదు. దీనిపై ప్రభుత్వం విధి విధానాలను రూపొందించి పాఠశాలల్లో ఉన్న వారిలో యువ ఉపాధ్యాయులను తప్పనిసరి చేసేలా ఆదేశాలు ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ప్రిన్సిపాల్ సంతకం లేకున్నా హాజరుకావచ్చు

- హాజరుతో సంబంధం లేకుండా పరీక్ష రాసే అవకాశం
- వాట్సాప్ నుంచి హాల్‌టిక్కెట్లు డౌన్‌లోడు చేసుకునే సౌలభ్యం
- ప్రతీ కేంద్రంలో సీసీ కెమేరాలతో నిఘా.. గుంటూరు నుంచి పర్యవేక్షణ
- పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేశామన్న ఇంటర్ బోర్డు ఆర్ఐవో జుబేర్



వివరాలు వెల్లడిస్తున్న ఆర్ఐవో జుబేర్

గుంటూరు (విద్య), ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ పరీక్షలకు జిల్లాలో పకడ్బందీగా ఏర్పాట్లు చేసినట్లు ఇంటర్ బోర్డు ఆర్ఐవో జుబేర్ తెలిపారు. శనివారం ఇంటర్ బోర్డు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ఏడాది తొలిసారిగా ఫీజు కట్టిన ప్రతి విద్యార్థి హాజరుతో సంబంధం లేకుండా పరీక్ష రాసే అవకాశం కల్పించామన్నారు. హాల్‌టిక్కెట్లు వాట్సాప్(95523 00009) నుంచి డౌన్‌లోడు చేసుకోవచ్చన్నారు. వాటిపై ప్రిన్సిపాల్ సంతకం లేకున్నా సరే నేరుగా పరీక్షకు హాజరుకావచ్చని తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని, పరీక్షలు జరిగే సమయంలో కేంద్రాల సమీపంలోని జిరాక్స్ సెంటర్లు మూసివేయాలని ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. పరీక్షలపై సందేహాలు, ఫిర్యాదుల కోసం కార్యాలయంలో ప్రత్యేసెల్ (0863-2228528) అందుబాటులోకి తెచ్చామన్నారు. మార్చి 1 నుంచి ఇంటర్ పరీక్షలు ప్రారంభం కానున్నాయన్నారు. ఉదయం 9 నుంచి 12 గంటల వరకు పరీక్ష ఉంటుందని, కేంద్రాల్లోకి 8.30 కల్లా అనుతిస్తామన్నారు. 9 గంటల తర్వాత ఒక్క నిమిషం ఆలస్యమైనా కేంద్రాల్లోకి అనుతించమన్నారు.

జిల్లాకు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినర్‌గా ఎస్‌వీ సుబ్బారావు, పరీక్షల ప్రత్యేక అధికారిగా డీవీఈవో పద్మను ప్రభుత్వం నియమించిందన్నారు. పరీక్షల నిర్వహణపై ఇప్పటికే చీఫ్ సూపరింటెండెంట్స్, డిపార్టుమెంట్ ఆఫీసర్లతో సమీక్ష నిర్వహించినట్లు తెలిపారు. పరీక్షల కోసం విస్తృత ఏర్పాట్లు చేయడంతో పాటు ప్రశాంత వాతావరణంలో విద్యార్థులు పరీక్షలు రాసేలా ఏర్పాట్లు చేయాలని కేంద్రాల నిర్వాహకులకు ప్రత్యేక ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. ఈ ఏడాది ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలకు 34,273 మంది, ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 34,973 మంది, మొదటి సంవత్సరం వృత్తి విద్యా కోర్సుల పరీక్షలకు 1215 మంది, ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 867 మంది చొప్పున మొత్తం 71,528 మంది విద్యార్థులు పరీక్ష హాజరుకానున్నట్లు తెలిపారు. ఇందుకోసం 81 కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఆయా కేంద్రాల్లో సీసీ కెమేరాలతో నిఘా ఏర్పాటు చేశామన్నారు. సీసీ కెమేరాల ద్వారా పరీక్షల్ని పర్యవేక్షించడానికి గుంటూరులోని ఇంటర్ బోర్డు, విజయవాడలోని ఇంటర్ బోర్డు ప్రధాన కార్యాలయం నుంచి ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ప్రశ్నపత్రాల కోసం 16 స్టోరేజ్ కేంద్రాలు(పోలీసు స్టేషన్స్) ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్షల పర్యవేక్షణ కోసం 83 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, మరో 83 మంది డిపార్టుమెంట్ ఆఫీసర్లను ప్రభుత్వం నియమించినట్లు తెలిపారు. ఈ నెల 24 నుంచి స్టోరేజ్ కేంద్రాల నుంచి పరీక్షా కేంద్రాలకు ప్రశ్నపత్రాలు తరలిస్తామన్నారు.

పశ్చిమ డెల్టాకాల్వకు 2010 క్యూసెక్కుల నీరు

దుగ్గిరాల, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ప్రకాశం బ్యారేజి నుంచి పశ్చిమ డెల్టా కాల్వకు 2010 క్యూసెక్కుల సాగునీటిని శనివారం విడుదల చేసినట్లు నీటి పారుదలశాఖ అధికారులు తెలిపారు. బ్యారేజి వద్ద 11.9 అడుగుల నీటి మట్టం ఉండగా, దుగ్గిరాల సబ్‌డివిజన్ నుంచి రేపల్లెకాల్వకు 163 క్యూసెక్కుల నీరు, తూర్పు కాల్వకు 287, పశ్చిమకాల్వకు 150, నిజాంపట్నంకాల్వకు 100, కొమ్మమూరు కాల్వకు 1245 క్యూసెక్కుల నీరు, విడుదల చేస్తున్నారు.

రేషన్ కార్డుల ఈకేవైసీ పూర్తి చేయాలి : తహసీల్దార్

కాకుమాను, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): రేషన్ కార్డుల ఈకేవైసీ ఈ నెలాఖరులోపు పూర్తి చేయాలని తహసీల్దార్ వెంకటస్వామి ఆదేశించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శనివారం రేషన్ పంపిణీపై సమీక్ష నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ డీలర్లు ఆథరైజేషన్ రెన్యువల్ క్రమం తప్పకుండా చేయించుకోవాలని సూచించారు. నిత్యావసర వస్తువుల పంపిణీలో అవకతవకలకు పాల్పడేవారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో రేషన్ డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లు, వీఆర్వోలు, తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎం గోడౌన్‌ల పరిశీలన



రేపూడి ఈవీఎం గోడౌన్‌ను పరిశీలిస్తున్న ఆర్డీవో కే శ్రీనివాసరావు

ఫిరంగిపురం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేపూడి గ్రామంలో గల మార్కెట్ యార్డు గోడౌన్‌లోని వీవీ ప్యాట్స్ గోడౌన్‌ను గుంటూరు రెవెన్యూ డివిజనల్ అధికారి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా గోడౌన్ భద్రతా విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కే ప్రసాదరావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర వక్ఫ్ బోర్డు సీఈవో ఆలీకి సన్మానం



షేక్ మహమ్మద్ ఆలీని సన్మానిస్తున్న దర్గా, మసీదు కమిటీ సభ్యులు

ఫిరంగిపురం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వక్ఫ్ బోర్డు సీఈవో షేక్ మహమ్మద్ ఆలీ శనివారం తన స్వగ్రామమైన మండలంలోని వేములూరిపాడు గ్రామానికి విచ్చేసిన సందర్భంగా కొండవీడుకు చెందిన హజరత్ సయ్యద్ హుగాదే ఫకీర్ షా చౌదరి దర్గా, మసీదు కమిటీ సభ్యులు సీఈవోను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో దర్గా కమిటీ అధ్యక్షుడు సయ్యద్ నౌషాద్, కార్యదర్శి సయ్యద్ షాజిమ్ షా, సయ్యద్ అబ్దుల్ వజీద్, సయ్యద్ సనవుల్లా, సయ్యద్ జమాల్, జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్‌శాఖలో పలువురు అధికారులకు ఉద్యోగోన్నతి

గుంటూరు, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ లిమిటెడ్‌లో (ఏపీ సీపీడీసీఎల్) ఆపరేషన్ విభాగంలో పలువురు అధికారులకు ఉద్యోగోన్నతి కల్పిస్తూ సీఎండీ (ఎఫ్ఏసీ) ఏకేవీ భాస్కర్ శనివారం రాత్రి ఆదేశాలు జారీ చేశారు. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు (ఈఈ)గా వ్యవహరిస్తున్న కేవీఎల్ఎన్ మూర్తి, కే వెంకటేశ్వర్లు, జీ ఆంజనేయులు, ఎం శ్రీనివాసరావు, శ్రీనివాసులరెడ్డి, రమేష్‌బాబుకు సూపరింటెండెంట్ ఇంజనీర్లు (ఎస్ఈ)లుగా పదోన్నతి కల్పించారు. అలానే సీపీడీసీఎల్‌లో మరో ఆరుగురు డిప్యూటీ ఈఈలను ఈఈలుగా, మరో ఆరుగురు ఏఈలను డిప్యూటీ ఈఈలుగా పదోన్నతి కల్పిస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటికే ఉద్యోగోన్నతిలో జాప్యం జరిగిందని, కొన్ని న్యాయపరమైన చిక్కులు తొలగిపోవటంతో లైన్‌క్లియర్ అయినట్లు ఆ శాఖ వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం ఎస్ఈలుగా పదోన్నతి పొందిన వారు గుంటూరు సర్కిల్ టెక్నికల్ ఈఈగా ఉన్న కేవీఎల్ఎన్ మూర్తి సర్కిల్ ఆపరేషన్ ఇన్‌ఛార్జ్ ఎస్ఈగా వ్యవహరిస్తున్నారు. సీహెచ్ రమేష్‌బాబు (గుంటూరు టౌన్-2), కే వెంకటేశ్వర్లు (ఒంగోలు ఇన్‌ఛార్జ్ ఎస్ఈ), శ్రీనివాసులరెడ్డి (పల్నాడు ఎంఆర్‌టీ), జీ ఆంజనేయులు (బాపట్ల, ఇన్‌ఛార్జ్ ఎస్ఈ) ఎం శ్రీనివాసరావు (కన్‌స్ట్రక్షన్స్, ఈఈ)లుగా వ్యవహరిస్తున్నారు. వారికి పోస్టింగ్‌లు ఎక్కడనేది త్వరలోనే ప్రకటించనున్నట్లు సమాచారం.

రేపు చేతివృత్తిదారుల జిల్లా సదస్సు

మంగళగిరి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): చేతి వృత్తుల పరిరక్షణకు చర్యలు తీసుకోవడంతోపాటు వృత్తిదారుల సంక్షేమానికి, కార్పొరేషన్లకు నిధులు కేటాయించి సబ్సిడీపై రుణాలు అందించాలని ఏపీ చేతి వృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షుడు గొట్టుముక్కల బాలాజీ, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య డిమాండ్ చేశారు. మంగళగిరి సీపీఐ కార్యాలయంలో శనివారం వారు మీడియాతో మాట్లాడారు. దేశంలోను, రాష్ట్రంలోను చేతివృత్తులను ప్రోత్సహించడంలో పాలక ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు. ఆయా వృత్తుల్లో ఆధునిక యంత్ర పరికరాలు రావడంతో వృత్తిదారులు కార్పొరేట్ శక్తులతో పోటీ పడలేక వృత్తులకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. డిమాండ్ల పరిష్కారం కోసం ఈ నెల 24వ తేదీన ఉదయం మంగళగిరిలో చేతి వృత్తిదారుల జిల్లా సదస్సు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. చేతివృత్తిదారులు పెద్దసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఏపీ మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి పీ.నాగాంజనేయులు, ప్రభాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రిలో వైద్యులు లేకపోవడంపై ఎమ్మెల్యే ఆగ్రహం

- తీరు మారకపోతే కమిషనర్‌తో మాట్లాడతా
- హెచ్చరించిన బూర్ల రామాంజనేయులు



వైద్యశాలలో వైద్యుల హాజరు పట్టికను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు సామాజిక ఆరోగ్య కేంద్రంలో వైద్యుల తీరుపై ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మధ్యాహ్నం తరువాత ఒక్క వైద్యుడు కూడా లేకుండా వైద్యశాల మొత్తాన్ని ఒక స్టాఫ్ నర్సుకు అప్పగించడంపై ఆయన ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఏడుగురు వైద్యులతో 24 గంటల వైద్యం అందాల్సిన ఈ వైద్యశాలలో వైద్యం అందనంత దూరంలో ఉంది. శనివారం సాయంత్రం నాలుగు గంటల తరువాత ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు సామాజిక వైద్యశాలలో ఆకస్మిక తనిఖీ చేశారు. ఆ సమయంలో కేవలం ఒక స్టాఫ్ నర్సు మాత్రమే అందుబాటులో ఉన్నారు. 9 మంది స్టాఫ్ నర్సులు, 8 మంది పారామెడికల్ సిబ్బంది ఉండాల్సిన వైద్యశాలలో ఒక్క స్టాఫ్ నర్సు మాత్రమే విధుల్లో ఉండటంపై ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. దీంతో ఆయన వైద్యవిధాన పరిషత్ డీసీహెచ్ఎస్‌తో ఫోన్‌లో మాట్లాడారు. గుంటూరుకు పక్కనే ఉన్న ప్రత్తిపాడు వైద్యశాలను పరిశీలించాల్సిన అవసరం ఉందని సూచించారు. వైద్యుల విధుల్లో సరిగ్గా ఉండటం లేదని ఇప్పటికే చాలా ఫిర్యాదులు వచ్చాయని వెంటనే పరిశీలించి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే అన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ హాస్పిటల్ గత వైసీపీ ప్రభుత్వంలో మాదిరిగా ప్రజలను పట్టించుకోకుండా సరిగా విధులకు హాజరు కాకుండా ఉంటే చూస్తూ ఊరుకునేది లేదన్నారు. తీరు మారకపోతే వైద్యశాఖ ముఖ్య కార్యదర్శితో పాటు ఆరోగ్యశాఖ మంత్రి దృష్టికి కూడా తీసుకెళ్లాల్సి వస్తుందని హెచ్చరించారు. వైద్యులు తమ పద్ధతి మార్చుకుని ప్రజలకు సరైన సర్వీసులు అందించాలని ఆయన వైద్యులను కోరారు.

కో లొకేటెడ్ పీహెచ్‌సీ ఉన్నా నిరుపయోగమే

సామాజిక ఆరోగ్య కేంద్రంలో కో లొకేటెడ్ పీహెచ్‌సీ కూడా నడుస్తుంది. దీని తరఫున ఇద్దరు వైద్యులు ఉండగా ఒక వైద్యుడు డిప్యుటేషన్‌లో ఉండగా, మరొకరు విధుల్లో ఉండాల్సి ఉంది. అయితే వైద్యశాలలో విధులకు హాజరైన దాఖలాలు లేవని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఇక్కడ ఉన్న అన్ని పరిస్థితులపై స్టాఫ్ నర్సు నుంచి లిఖిత పూర్వకంగా లెటర్ రాయించుకుని తీసుకెళ్లారు.

టమోట రైతులను ఆదుకునేందుకు చర్యలు

టమోట రైతులను ఆదుకునేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే రామాంజనేయులు తెలిపారు. ప్రత్తిపాడులో టమోట పంటలను ఆయన పరిశీలించారు. దిగుబడి ఉన్నా రేటు లేకపోవడం వల్ల నష్టపోవాల్సి వస్తుందని రైతు బొబ్బూరి కృష్ణంరాజు ఆవేదన వ్యక్తం చేశారు. ఎకరాకు రూ.90 వేల వరకు పెట్టుబడి పెట్టామని, కాయల దిగుబడి వచ్చినా రేటు మాత్రం చాలా తక్కువగా ఉందన్నారు. మంత్రి నారా లోకేశ్ రైతు బజార్ల ద్వారా దిగుబడులు నేరుగా అమ్ముకునే వెసులుబాటు కల్పిస్తున్నట్లు ఆయన తెలిపారు. గత ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని పూర్తిగా విస్మరించడం వల్లనే నేడు రైతులకు ఈ పరిస్థితి వచ్చిందన్నారు. కూటమి ప్రభుత్వం రైతులకు పూర్తిగా అండగా ఉంటుందని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తెలుగురైతు రాష్ట్ర మీడియా కోఆర్డినేటర్ గింజుపల్లి వెంకటేశ్వరరావు, పార్టీ మండల అధ్యక్షుడు గింజుపల్లి శివరామప్రసాద్, చెన్నుబోయిన శ్రీనివాసరావు, కుర్రి సుబ్బారెడ్డి, అయినంపూడి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర భవిష్యత్తు గురించి పట్టభద్రులు ఆలోచించాలి

- ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు



గొట్టిపాడులో ఆలపాటికి మద్దతుగా ప్రచారం నిర్వహిస్తున్న డ్వాక్రా మహిళలు

పెదనందిపాడు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర భవిష్యత్తు గురించి పట్టభద్రులు ఆలోచించాలని ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు అన్నారు. స్థానిక పీఏఎస్ కళాశాలలో శనివారం పట్టభద్రులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు, పట్టభద్రులు ఆలపాటికి తొలిప్రాధాన్య ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఎనిమిది నెలల్లోనే సీఎం చంద్రబాబు అంధకారంలో ఉన్న రాష్ట్రాన్ని అభివృద్ధిపథంలో నడపడమే కాకుండా ఉద్యోగాల కల్పన, యువతకు ఉపాధి కల్పనపై దృష్టిసారిస్తున్నారన్నారు. రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా ముందుకు వెళుతుందన్నారు. కార్యక్రమంలో అశోకా పాఠశాల డైరెక్టర్ పోపూరి లక్ష్మీనారాయణ, శ్రీనివాసా పాఠశాల కోశాధికారి ముద్దన రాఘవయ్య, కళాశాల ప్రిన్సిపాల్ వీరరాఘవయ్య, టీడీపీ నేతలు పెంట్యాల శ్రీధర్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకుంటాం..

పెదనందిపాడులో ఈనెల 2న ఉన్మాది చేతిలో హత్యకు గురైన యార్ల రమణ కుటుంబాన్ని ఆదుకుంటామని ఎమ్మెల్యే అన్నారు. కుటుంబ సభ్యులు జరిగిన సంఘటన గురించి ఎమ్మెల్యేకు వివరించారు. ఆమెకు టీడీపీ సభ్యత్వం కూడా ఉన్నట్లు తెలిపారు. ప్రభుత్వం నుంచి కుటుంబాన్ని ఆదుకోవాలని కుమార్తె వీరమ్మ తన భర్త దివ్యాంగుడని, కుమారుడు తనతో పాటు కూలిపనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నట్లు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ప్రభుత్వం, పార్టీ నుంచి అన్ని విధాలా కుటుంబాన్ని ఆదుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

డ్వాక్రా మహిళల ప్రచారం..

ప్రత్తిపాడు (గొట్టిపాడు), ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు మద్దతుగా గొట్టిపాడులో డ్వాక్రా మహిళలు ప్రచారం నిర్వహించారు. గ్రామంలోని పాఠశాలతో పాటు ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రచారం నిర్వహించారు. డ్వాక్రా మహిళల కుటుంబాల్లో పట్టభద్రులను గురించి వారి గృహాలకు వెళ్లి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో గుంటుపల్లి శివకుమారి, సీతామహలక్ష్మి, నిమ్మగడ్డ సుజాత, సత్యవాణి, గౌరినేని లక్ష్మీ తిరుమల, కట్టా రమాదేవి, అనసూయమ్మ, నిమ్మగడ్డ యామిని, కుందేటి శివపార్వతి తదితరులు పాల్గొన్నారు.

వట్టిచెరుకూరులో..

వట్టిచెరుకూరు, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): ఆలపాటి విజయాన్ని కాంక్షిస్తూ కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తలు ముట్లూరులోని హైస్కూళ్ళు, ఎలిమెంటరీ స్కూళ్ళల్లో పని చేస్తున్న వారిని కలసి మొదటి ప్రాధాన్య ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ కూటమి నాయకులు వీరిశెట్టి జగన్‌మోహన్‌రావు, బీరాల శ్రీను, తుమ్మల రత్తయ్య, రామయ్య, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

కాకుమాను మండలంలో..

కాకుమాను, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): ఆలపాటిని గెలిపించాలని జనసేన నాయకుడు చట్టాల త్రినాథ్ కాకుమాను, రేటూరు, అప్పాపురం, తదితర గ్రామాల్లో మండల నాయకులతో కలసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షుడు గడ్డం శ్రీనివాసరావు, ఇక్కుర్తి శివరామకృష్ణ, పూర్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆలపాటిని భారీ మెజార్టీతో గెలిపించాలి

- జనసేన ప్రత్తిపాడు సమన్వయకర్త కొర్రపాటి

గుంటూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఆలపాటిని భారీ మెజార్టీతో గెలిపించాలని జనసేన ప్రత్తిపాడు సమన్వయకర్త కొర్రపాటి నాగేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. శనివారం ఆయన పెదపలకలూరు, తురకపాలెంలోని జూనియర్, ఇంజనీరింగ్ కళాశాలల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు వీ మల్లికార్జునరావు, అడపాల శివనాగేశ్వరరావు, అల్లం బ్రహ్మం, మంచాల రాఘవేంద్ర, కోటి శ్రీనివాసరావు, సత్యనారాయణ, వీరాంజనేయులు, శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మణరావు గెలుపునకు కృషి చేయాలి : పాశం రామారావు



సమావేశంలో మాట్లాడుతున్న పాశం రామారావు

మంగళగిరి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): కృష్ణా, గుంటూరు ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం నుంచి పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కేఎస్ లక్ష్మణరావు గెలుపు కోసం ప్రజాసంఘాల నేతలు కృషి చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పాశం రామారావు పిలుపునిచ్చారు. మంగళగిరి ప్రజాసంఘాల కార్యాలయంలో శనివారం సాయంత్రం జరిగిన సమావేశంలో ఆయన ప్రసంగించారు. లక్ష్మణరావు మూడు మార్లు ఎమ్మెల్సీగా గెలిచి శాసనమండలిలో అన్ని వర్గాల ప్రజల సమస్యలను ప్రస్తావించారని చెప్పారు. ఉద్యోగులు, నిరుద్యోగులు, కార్మికులు, స్కీం వర్కర్లు ఎదుర్కొంటున్న అనేక సమస్యల పరిష్కారానికి కృషి చేశారని తెలిపారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పట్టభద్రులు, నిరుద్యోగులు లక్ష్మణరావుకు ఓట్లేసి గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో ప్రజా సంఘాల నేతలు చెంగయ్య, వీసం జవహర్‌లాల్, ఈమని అప్పారావు, జేవీ రాఘవులు తదితరులు పాల్గొన్నారు.

● తాడేపల్లి టౌన్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): కేఎస్ లక్ష్మణరావు విజయాన్ని కాంక్షిస్తూ తాడేపల్లి పట్టణంలో శనివారం ప్రజాసంఘాల నాయకులు విస్తృత ప్రచారం నిర్వహించారు. అన్ని వర్గాల ప్రజల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్న లక్ష్మణరావుకు మొదటి ప్రాధాన్య ఓటు వేసి గెలిపించాలని కోరారు. బొగ్గిళ్లు, ఎర్రగడ్డ, ఎంహెచ్ కాలనీ, పాకిస్తాన్ ఏరియా ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు. బైపాస్‌లోని అపార్టుమెంట్‌లు, రెయిన్‌బో విల్లాస్, పలు అపార్టుమెంట్లలో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఎం, ప్రజా సంఘాల నేతలు వేముల దుర్గారావు, బూరుగ వెంకటేశ్వర్లు, కూరపాటి స్టీవెన్, విజయభాస్కరరెడ్డి, బర్నబాస్, శౌరి దుర్గారావు, నరసింహరావు తదితరులు పాల్గొన్నారు.

● దుగ్గిరాల, ఫిబ్రవరి 22: ఈమనిలో ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీచేస్తున్న కేఎస్ లక్ష్మణరావుకు ఓటు వేసి గెలిపించాలని కోరుతూ ఇంటింటికీ తిరిగి ప్రచారం కొనసాగించారు. వ్యవసాయకార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు జెట్టి బాలరాజు, భీమవరపు అమ్మిరెడ్డి, గిరిష్, స్టాలిన్, బ్రహ్మేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్‌కేంద్రాల పరిశీలన

దుగ్గిరాల, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): ఈ నెల 27వ తేదీన జరుగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల కోసం ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ ఐ సునీత శనివారం పరిశీలించారు. మొత్తం మూడు పోలింగ్‌కేంద్రాల్లో 2254 మంది పట్టభద్రులు తమ ఓటుహక్కును వినియోగించుకోనున్నారని తహసీల్దార్ తెలిపారు. పోలింగ్ ఏర్పాట్లను పరిశీలించామని, ఎన్నిక నిర్వహణకై ఒక్కోకేంద్రంలో ఒక పీవో, ఏపీవో, ఇద్దరు ఓపీవోలను నియమించినట్లు తెలిపారు.

నేడు భక్తులకు అన్నదానం

మంగళగిరి సిటీ, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): శ్రీభద్రావతి సమేత భావనారుషి స్వామి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా ఆదివారం వేలాది మందికి అన్న సంతర్పణ చేయనున్నట్టు మంగళగిరి పట్టణ పద్మశాలీయ బహూత్తమ సంఘం ప్రతినిధులు తెలిపారు. పట్టణంలోని నాంచారమ్మ చెరువు ప్రాంగణంలో సుమారు 30వేల మంది భక్తులకు అన్నదానం చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు వెల్లడించారు.

తడి, పొడిచెత్తలను వేరుచేసి సేకరించాలి



చిలువూరులో ఇంటింటికీ తిరిగి పొడిచెత్త, తడిచెత్త వేరుచేయాలని వివరిస్తున్న ఈవో శరత్, పారిశుధ్య సిబ్బంది

దుగ్గిరాల, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): రోజుకోసారైనా పారిశుధ్యసిబ్బంది ఇంటింటికీ తిరిగి తడిచెత్త, పొడిచెత్తలను వేర్వేరుగా సిద్ధం చేయాలంటూ ప్రజలకు అవగాహన కల్పించారు. పంచాయతీరాజ్ డైరెక్టర్ ఆదేశాలతో, మండలంలోని 18 గ్రామపంచాయతీల్లో ప్రత్యేక పారిశుధ్య నిర్వహణ కార్యక్రమం శనివారం నిర్వహించారు. రోజుకోసారైనా చెత్తను పారిశుధ్య సిబ్బంది ఇళ్లకు వచ్చి సేకరిస్తారంటూ, రెండ్రోజులపాటు, పారిశుధ్య సిబ్బంది చెత్తను సేకరించి, వాటిని సంపద షెడ్లకు తరలించి, ఎరువుగా మార్చి అతితక్కువ ధరకు విక్రయిస్తారని ప్రజలకు వివరించారు. ఇళ్లలోనూ, వ్యాపార సముదాయాల్లోనూ, ప్రతిరోజు ఉదయాన్నే పారిశుధ్య సిబ్బంది వచ్చే సమయానికి చెత్తను వేర్వేరుగా చెత్త బుట్టలలో సిద్ధం చేసి ఉంచాలన్నారు. ఎంపీడీవో శ్రీనివాసరావు, ఈవోపీఆర్డీ జవహర్ ఆయాగ్రామాల పంచాయతీ కార్యదర్శులు, పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.

● పెదనందిపాడు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): తడి పొడి చెత్తల సేకరణపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఈవోపీఆర్డీ వర్ధిని అన్నారు. మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో ప్రజలకు చెత్తసేకరణపై శనివారం అవగాహనా కార్యక్రమాలు నిర్వహించారు. ప్రజలు పంచాయతీ సిబ్బందికి సహకరించాలన్నారు. సేకరించిన చెత్తను సంపద కేంద్రాలకు తరలించి, కంపోస్ట్ ఎరువును తయారు చేసి విక్రయించి, పంచాయతీలకు ఆదాయాలను సమకూర్చుకోవాలని తెలిపారు. చెత్త సేకరణలో సిబ్బంది అలసత్వం వహించరాదని, సంపద కేంద్రాలు సక్రమంగా నిర్వహించేలా చూడాలని అధికారులకు సూచించారు.

ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్

ఫిరంగిపురం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఫిరంగిపురంలోని పంచాయతీ చేస్తున్న ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్‌ను గుంటూరు డీఎల్ పీవో శ్రీనివాస్ శనివారం పరిశీలించారు. స్వచ్ఛాంధ్ర, స్వచ్ఛ దివస్‌లో భాగంగా తనిఖీలు చేస్తున్నామని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా గ్రామంలోని మూడు బొమ్మల సెంటర్లో చెత్త సేకరిస్తున్న పారిశుధ్య కార్మికులకు ఆయన తడి చెత్త, పొడి చెత్త సేకరణపై అవగాహన కల్పించారు. గ్రామాన్ని స్వచ్ఛ గ్రామంగా తీర్చిదిద్దాలని సంబంధిత అధికారులకు ఆయన సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ ఈవో ఏ కిషోర్ బాబు, సిబ్బంది, కార్మికులు పాల్గొన్నారు.

చిన్నారుల సమగ్రాభివృద్ధికి కృషి చేయాలి

కాకుమాను, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): చిన్నారుల సమగ్రాభివృద్ధికి అంగన్‌వాడీలు కృషి చేయాలని నోడల్ అధికారి శ్రీవాణి అన్నారు. కాకుమాను జడ్పీ ఉన్నత పాఠశాలలో అంగన్‌వాడీలకు శిక్షణ తరగతులు నాలుగోరోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీలు వ్యక్తిగత ఆరోగ్యం పై శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. యోగా ప్రాముఖ్యతను తెలియజేశారు.

పీహెచ్‌సీకి బీపీ, వెయింగ్ మిషన్ల వితరణ



ప్రభుత్వ ఆస్పత్రికి బీపీ, వెయింగ్ మిషన్ల వితరణ చేస్తున్న దాత, నేతలు

తాడేపల్లి టౌన్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): తాడేపల్లి పీహెచ్‌సీకి వివిధ వ్యాధుల మీద సర్వే చేసేందుకు బీపీ మిషన్లు, వెయింగ్ మిషన్లు ఇతర సామాన్లు లేవని పల్లెటూరు చారిటబుల్ ట్రస్ట్ దృష్టికి పలువురు ఈ విషయం తీసుకురాగా శనివారం ఉదయం డిజిటల్ బీపీ, వెయింగ్ మిషన్లు, బ్యాటరీలు, టేపులు, టార్చ్‌లైట్లు దాత మణికంఠ సాయంతో పల్లెటూరు చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు జొన్నా రాజేష్ సహకారంతో అందజేశారు. ఈ సందర్భంగా జొన్నా రాజేష్ మాట్లాడుతూ ఇటువంటి యువతను ఆదర్శంగా తీసుకుని తాడేపల్లి మండల పట్టణ ప్రాంతాల్లో ప్రతి గ్రామంలో యువకులు ముందుకు వచ్చి ఏదో ఒక సేవాకార్యక్రమం చేయాలని పిలుపునిచ్చారు. మన సమాజాన్ని మనమే మార్చుకోవాలని పవన్‌కల్యాణ్ స్ఫూర్తితో యువత రాజకీయాల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ శాంతి, అనూష, సీహెచ్‌వో గురుకుమార్, యూడీసీ హరి, ఆయుర్వేద డాక్టర్ శ్రీధర్, పట్టణ జనసేన అధ్యక్షుడు అంబటి తిరుపతిరావు, దినేష్‌చక్రవర్తి నాని, ఉద్యోగులు పాల్గొన్నారు.

ముమ్మరంగా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం



చిలువూరులో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న నియోజకవర్గ పరిశీలకుడు జంపాల సీతారామయ్య, ఇన్‌చార్జి ఎంపీపీ జబీన్, శ్రీఅనిత, తదితరులు

దుగ్గిరాల, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీగా కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని, ఎమ్మెల్సీ ఎన్నికల మంగళగిరి నియోజకవర్గ పరిశీలకుడు జంపాల సీతారామయ్య అన్నారు. చిలువూరు, రేవేంద్రపాడు, దుగ్గిరాల, పెనుమూలి గ్రామాల్లో శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సీతారామయ్య మాట్లాడుతూ నియోజక వర్గంలో 15,572 పట్టభద్రుల ఓట్లున్నాయన్నారు. మంత్రి నారా లోకేశ్‌ను గత అసెంబ్లీ ఎన్నికల్లో 92వేల మెజార్టీతో గెలిపించారని, అదేవిధంగా ఆలపాటిని భారీమెజార్టీతో గెలిపించాలన్నారు. ఇన్‌చార్జి ఎంపీపీ షేక్ జబీన్, టీడీపీ మండల అధ్యక్షురాలు కేసంనేని శ్రీఅనిత, వాణిజ్యవిభాగ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గూడూరు వెంకట్రావు, ఎంపీటీసీలు కొప్పుల మధుబాబు, మరియ రోజమ్మ, నాయకులు తోటకూర సీతారామయ్య నజీర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల మనిషి ఆలపాటిని గెలిపించుకుందాం : పోతినేని

మంగళగిరి సిటీ, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): నిత్యం ప్రజల్లో ఉంటూ అన్ని వర్గాల ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేసే ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని టీడీపీ గుంటూరు పార్లమెంటు ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు మద్దతుగా కూటమి నేతలు శనివారం మంగళగిరిలో విస్తృత ప్రచారం నిర్వహించారు. పట్టభద్రులను కలిసి కరపత్రాలు పంచి ఓట్లను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్ రియాజ్, కూటమి నేతలు షేక్ సుభానీ, ఖాదర్ వలి, సమీరా, షేక్ కైరుల్లా, సుభానీ (గల్ఫ్), అన్వర్, తుమ్మలచెరువు అనురాగ్ తదితరులు పాల్గొన్నారు. కూటమి నాయకులు శనివారం ఎంటీఎంసీ, ఆర్టీసీ, సబ్‌రిజిస్ట్రార్, తహసీల్దారు, ఎంపీడీవో కార్యాలయాల్లో అధికారులు, ఉద్యోగులను కలిసి ఓట్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా టీటీడీ ధర్మకర్తల మండలి సభ్యురాలు తమ్మిశెట్టి జానకీదేవి మాట్లాడుతూ ఆలపాటికి ప్రతి ఒక్కరూ అండగా నిలిచి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కూటమి నాయకులు మున్నంగి శివశేషగిరిరావు, గోవాడ దుర్గారావు, కొదమల సైమన్, వాకా మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ పట్టణ అధ్యక్షుడు వల్లభనేని వెంకట్రావు ఆధ్వర్యంలో..

తాడేపల్లి టౌన్ / తాడేపల్లి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి పట్టణంలోని నులకపేట, తహసీల్దార్ కార్యాలయం, ఎంఈవో ఆఫీస్, సబ్‌స్టేషన్, ప్రభుత్వ పాఠశాల, ఆరోగ్య కేంద్రం, ఉర్దూ స్కూల్, సచివాలయ ప్రాంతాల్లో టీడీపీ పట్టణ అధ్యక్షుడు వల్లభనేని వెంకట్రావు ఆధ్వర్యంలో ఈ నెల 27న జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి ఆలపాటికి మొదటి ప్రాధాన్య ఓటు వేసి గెలిపించాలని కోరుతూ నేతలు, కార్యకర్తలు ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ పరిశీలకులు ముమ్మడి సత్యనారాయణ, పట్టణ ప్రధాన కార్యదర్శి దారా దాసు, అద్దంకి మురళి, ఇట్టా భాస్కర్, కటాబత్తుని నిర్మల, సాగర్, శౌరి, దుబాయ్ మస్తాన్, చాంద్‌బాషా తదితరులు పాల్గొన్నారు. కాగా ఆలపాటిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి దానబోయిన సుందరరావుయాదవ్ విజ్ఞప్తి చేశారు.

ఆలపాటి గెలుపు కోసం పాటుపడాలి : చిల్లపల్లి



ఆలపాటికి మద్దతుగా ప్రచారం చేస్తున్న జనసేన పార్టీ శ్రేణులు

మంగళగిరి సిటీ, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఆలపాటి రాజేంద్రప్రసాద్ గెలుపు కోసం జనసేన పార్టీ శ్రేణులు పాటుపడాలని ఏపీ ఎంఎస్ఐడీసీ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. మంగళగిరి జనసేన పార్టీ కార్యాలయంలో శనివారం ముఖ్యనాయకులతో సమావేశమై ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి పార్టీ నేతలకు పలు సూచనలు చేశారు. అనంతరం ఆలపాటికి మద్దతుగా సీకే విద్యాసంస్థల్లో అధ్యాపకులు, ఉపాధ్యాయులను కలిసి ఓట్లను అభ్యర్థించారు. ఆలపాటిని గెలిపిస్తే ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి చక్కని అవకాశం లభిస్తుందన్నారు. ఆలపాటిని భారీ మెజార్టీతో గెలిపించి నిరుద్యోగ యువత, పట్టభద్రులు తమ బంగారు భవిష్యత్తుకు మార్గం వేసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో జనసేన పార్టీ ఎమ్మెల్సీ ఎన్నికల గుంటూరు పార్లమెంటు నియోజకవర్గ సమన్వయకర్త నయబ్ కమల్, నియోజకవర్గంలోని ఆయా మండలాలు, పట్టణాలకు చెందిన ముఖ్యనాయకులు పాల్గొన్నారు.

వ్యవసాయంలో డ్రోన్‌ల వినియోగం తప్పనిసరి

- రైతు నేస్తం ఫౌండేషన్ చైర్మన్ వై వెంకటేశ్వరరావు



వడ్లమూడిలోని విజ్ఞాన్ కళాశాల విద్యార్థులకు డ్రోన్ పని తీరును వివరిస్తున్న రైతు నేస్తం ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ వెంకటేశ్వరరావు

వట్టిచెరుకూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): పంటల సాగులో చీడ, పీడల నివారణ ప్రధాన సమస్యగా ఉందని, వాటి నివారణకు వినియోగించే పరికరాల్లో పెను మార్పులు వచ్చిన నేపథ్యంలో తక్కువ ఖర్చు, సమయం ఆదా అయ్యే డ్రోన్‌ల వినియోగం తప్పనిసరి అవుతుందని రైతు నేస్తం ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ వై వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని పుల్లడిగుంట సమీపంలోని రైతు నేస్తం ఫౌండేషన్‌లో శనివారం పంటల సాగులో చీడ, పీడలు, తెగుళ్ళ నివారణ కోసం మానవ రహితంగా వినియోగంలోకి వచ్చిన డ్రోన్‌ల ఆవశ్యకత, పనితీరుపై నిర్వహించిన అవగాహన సదస్సులో వడ్లమూడి విజ్ఞాన్ కళాశాలలో వ్యవసాయ విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు పాల్గొన్న కార్యక్రమంలో డాక్టర్ వై వెంకటేశ్వరరావు డ్రోన్‌ల పనితీరు, ఆవశ్యకతను వివరించారు. విద్యార్థులు క్షేత్ర స్థాయిలో డ్రోన్‌ల పిచికారి పని తీరును, విధానాన్ని ఆయన వివరించారు. కార్యక్రమంలో విజ్ఞాన్ విశ్వవిద్యాలయ అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఎల్ గీతాంజలి, శ్రీనివాస్, టీచింగ్ కమ్ రీసెర్చ్ అసిస్టెంట్ కే తేజశ్రీ, వ్యవసాయ శాఖ విశ్రాంత అడిషనల్ డైరెక్టర్ కే రామచంద్రం తదితరులు పాల్గొన్నారు.

నేలలో సేంద్రియ, కర్బనం పెరగాలి

- వ్యవసాయశాఖ విశ్రాంత అడిషనల్ డైరెక్టర్ కే రామచంద్రం

వట్టిచెరుకూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): నేలలో తగిన మోతాదులో సేంద్రియ పదార్థం ఉన్నట్లయితే జీవ జాలం తగిన మోతాదులో ఉండటానికి అవకాశం ఉంటుందని వ్యవసాయ శాఖ విశ్రాంత అడిషనల్ డైరెక్టర్ కే రామచంద్రం సూచించారు. మండలపరిధిలోని పుల్లగుడిగుంట సమీపంలోని రైతునేస్తం ఫౌండేషన్‌లో శనివారం సేంద్రియ సాగు విధానం, కషాయాలు, మిశ్రమాల తయారీతో పాటు రైతులు పండించిన వ్యవసాయ దిగుబడులకు విలువ జోడింపు వంటి అంశాలపై మూడు రోజుల రైతు శిక్షణా కార్యక్రమానికి కే రామచంద్రం ముఖ్యఅతిథిగా పాల్గొని రైతులకు పలు సూచనలు చేశారు.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

సాంకేతిక పరిజ్ఞానంతో వ్యవసాయాభివృద్ధి

● ఎన్‌ఐపీహెచ్‌ఎం జాయింట్ డైరెక్టర్ డాక్టర్ విధుకంపురత్



మాట్లాడుతున్న ఎన్‌ఐపీహెచ్‌ఎం జాయింట్ డైరెక్టర్ డాక్టర్ విధుకంపురత్

కొల్లిపర, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): రైతులు సాంకేతిక పరిజ్ఞానం ద్వారా వ్యవసాయాన్ని మరింత అభివృద్ధి చేసుకోవాలని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్లాంట్ హెల్త్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ పి.విధుకంపురత్ అన్నారు. శనివారం మండల కేంద్రం కొల్లిపరలో విజ్ఞాన్ విశ్వవిద్యాలయం డీన్ డాక్టర్ తాతినేని రమేష్‌బాబు అధ్యక్షతన వ్యవసాయ పంటల సంరక్షణ సాంకేతికతలపై రైతు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొని విధుకంపురత్ మాట్లాడుతూ రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి పెట్టాలని, ప్రకృతి సాగు పంటలను ఆహారంగా తీసుకోవడం వలన రోగాల బారిన పడకుండా ఉండటానికి అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో విజ్ఞాన్ విశ్వవిద్యాలయం సమన్వయకర్త డాక్టర్ హాడోల్‌మహేష్‌వినాయక్, డాక్టర్ రమ్య, డాక్టర్ హరీష్, డాక్టర్ మాధవి, ఏవో వెంకట్రావు, వీహెచ్‌ఏ రవితేజ, రైతులు నెర్ల కుటుంబరెడ్డి, దొంతిరెడ్డి శ్రీనివాసరెడ్డి, ఉయ్యూరు సాంబిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సందడిగా అంతర్జాతీయ కవలల దినోత్సవం

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బోసురోడ్డు సమీపంలో గల నెహ్రూనికేతన్ స్కూల్లో శనివారం అంతర్జాతీయ కవలల దినోత్సవం నిర్వహించారు. 8 జతల కవలలు ఒకే రకమైన దుస్తులు ధరించి పాఠశాలకు హాజరై సందడి చేశారు. వీరిలో బాలికలు నాలుగు జతలు కాగా, బాలురు రెండు జతలు, మిగిలిన జతలు బాల బాలికలు కావడం విశేషం. ఈ సందర్భంగా కవలలను స్కూల్ ఎండీ మురళీకాంత్, ఈడీ గీతాకాంత్ ఆశీర్వదించి, మిఠాయిలు అందజేశారు.

విద్యార్థులకు నగదు పురస్కారం



రూ.10వేల నగదు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఉమ

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): 10వ తరగతిలో గత వార్షిక పరీక్షల్లో ప్రతిభకనబరిచిన ఐతానగర్‌లోని ఎన్‌ఎస్‌ఎస్‌ఎం హైస్కూలు విద్యార్థినులు జయశ్రీ, అక్షయ గ్లోరీలకు రూ.10వేల నగదు పురస్కారాన్ని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోగినేని ఉమ అందజేశారు. గుమ్మడి విజయలక్ష్మి స్మారకార్థం శనివారం పాఠశాలలో ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమంలో డాక్టర్ సాంబశివరావు ఆర్థిక సహకారంతో విద్యార్థినులకు నగదు ప్రోత్సాహకాన్ని అందజేశారు. కార్యక్రమంలో బెల్లంకొండ వెంకట్, రాజ్యలక్ష్మి, ప్రసాద్, శారదా పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో దత్త హోమ పూజలు



హోమపూజలు జరుపుతున్న పండితులు

తెనాలి రూరల్, ఫిబ్రవరి22(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదరావూరులో దత్తహోమ పూజలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఆంజనేయస్వామి ఆలయంలో విశ్వశాంతి, ప్రజల శ్రేయస్సు కోరతూ పండితులు హోమపూజలు జరిపారు. సమీప గ్రామాల ప్రజలు హోమపూజల్లో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. రంగావజ్ఝుల రాధాకృష్ణ సుందరం ఆధ్వర్యంలో జరిగిన పూజల్లో రంగావజ్ఝుల రవితేజ, విష్ణుభొట్ల నరసింహ అవధాని, లక్ష్మీపతి సోమయాజులు, దావులూరు రామమూర్తి సిద్ధాంతి, సత్యనారాయణ ఘణాపాటి పాల్గొన్నారు.

విశ్వశాంతికి దత్తహోమం



యాగం నిర్వహిస్తున్న రుత్వికులు

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రా మలింగేశ్వర పేటలో దత్త హోమం చేపట్టారు. విశ్వశాంతి శ్రేయస్సు కోరుతూ హోమంతో పాటు దత్తాత్రేయ ద్వాదశాక్షరి మంత్రాన్ని జపిస్తూ హోమాన్ని చేపట్టారు. ఈ నెలాఖరుకు ఏడు కోట్ల దత్త హోమం పూర్తికానుందని విష్ణుభొట్ల సత్యనారాయణ ఘనపాటి తెలిపారు. రాధాకృష్ణసుందరం ఆధ్వర్యంలో రవితేజ, రామ్మూర్తి, నరసింహ అవధాని హోమంలో పాల్గొన్నారు. పలు ప్రాంతాల నుంచి రుత్వికులు వచ్చి యాగం చేశారు. భాస్కర్‌దత్ హోమాన్ని పర్యవేక్షించారు.

వైభవంగా ఆరాధన మహోత్సవాలు

తెనాలి రూరల్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని సంగంజాగర్లమూడిలో ఉన్న భగవాన్ వెంకయ్యస్వామి ఆరాధన మహోత్సవాలను శనివారం వై భవంగా నిర్వహించారు. తెల్లవారు జామునుండే స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసి మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ చేశారు. భగవాన్ వెంకయ్యస్వామి చూ పినబాటలో ప్రతిఒక్కరూ నడుచుకుంటూ సమాజంలో శాంతి, సహనం, ప్రేమ తో మసులుకోవాలని స్వామిసేవకుడు గంగాధర్‌స్వామి భక్తులకు ఉపదేశించారు. జంపాల గోపాలరావు దివ్యజ్యోతి పూజాకార్యక్రమాలను పర్యవేక్షించారు.

ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థిని గెలిపించాలి

పొన్నూరుటౌన్; ఫిబ్రవరి 22: ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థిగా పోటీచేస్తున్న ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని టీడీపీ పార్లమెంట్ రైతు విభాగం ప్రధాన కార్యదర్శి బొర్రు రామారావు కోరారు. మండల పరిధిలోని ములుకుదుర గ్రామంలో శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పట్టభద్రులంతా ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు ప్రధమ ప్రాధాన్య ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు షేక్ షాపూర్ సాహేబ్, మహంకాళేశ్వరరావు, సుబ్రహ్మణ్యం, షేక్ కమల్ బాషా, కాటూరి శ్రీనివాసరావు, కూచిపూడి రత్నబాబు, తదితరులు పాల్గొన్నారు.



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు

ఎమ్మెల్సీగా ఆలపాటిని గెలిపించుకుందాం

● వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు



మాట్లాడుతున్న ఆనందబాబు, పక్కన బీటీనాయుడు, గౌరీశంకర్ తదితరులు

తెనాలి రూరల్, ఫిబ్రవరి22 (ఆంధ్రజ్యోతి): మంచి వ్యక్తిత్వం కలిగిన నాయకుడు, స్నేహశీలి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను ఎమ్మెల్సీ ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపించాలని వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు పిలుపునిచ్చారు. శ నివారం పట్టణంలోని జిల్లా కో-ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ రిటైర్డ్ ఎంప్లాయీ స్ వెల్ఫేర్ అసోసియేషన్ గుంటూరు ఆ ధ్వర్యంలో ఆనంద్‌బాబు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనందబాబు మాట్లాడుతూ ఎమ్మెల్యేగా, మంత్రిగా సేవలందించిన ఆలపాటి ప్రజాసేవలో మంచి వ్యక్తిత్వం కలిగిన నాయకుడిగా ప్రజ ల మన్ననలు పొందారన్నారు. ఎమ్మెల్సీగా పోటీచేస్తున్న ఆయనను పట్టభద్రులందరూ ఓటువేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పలువురు బ్యాంక్ ఉద్యోగులు, కూటమి శ్రేణులు పాల్గొన్నారు.

కూటమి శ్రేణులతో సమావేశం..

పట్టణంలోని టీడీపీ కార్యాలయం లో ఆదోని ఎమ్మెల్సీ బీటీనాయుడు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులతో కలిసి ఆనంద్‌బాబు ప్రత్యేక సమావే శం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనంద్‌బాబు మాట్లాడుతూ తెనాలి, వేమూరు నియోజకవర్గాల్లో ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు అధిక మెజార్టీ వచ్చేలా పనిచేద్దామని వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనంద్‌బాబు అన్నా రు. గత వైసీపీ ప్రభుత్వంపై కూటమి గెలుపుకు నాయకులు, కార్యకర్తలు ఎంతో పట్టుదలతో పని చేసి ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకువచ్చారన్నారు. అదే స్ఫూర్తితో ఎమ్మెల్సీ ఎన్నికలను ముందుకు తీసుకుపోవాలన్నారు. కార్యక్రమంలో పెద్దఎత్తున, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులు, ఉద్యోగులకు భరోసాగా నిలుస్తా

● కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న ఆలపాటి రాజేంద్రప్రసాద్

తెనాలి రూరల్, ఫిబ్రవరి22(ఆంధ్రజ్యోతి): కృష్ణా, గుంటూరు ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీచేస్తున్న తనను పట్టభద్రులందరూ మొదటి ప్రాధాన్య ఓటు వేసి గెలిపిస్తే నిరుద్యోగులు, ఉద్యోగులు, యువతకు భరోసాగా నిలుస్తానని కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ అన్నారు. శనివారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో జనసేన నేత చందుసాంబశివరావు ఆధ్వర్యంలో జనసేన ఐటీ, నాన్‌ఐటీ ఉద్యోగస్థులు, గ్రాడ్యుయేట్ల బృందం ఆలపాటిని కలిసి వారి సంపూర్ణ మద్దతును ప్రకటించింది. ఈ సందర్భం గా వారికి ఆలపాటి కృతజ్ఞతలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ తనపై ఉంచిన నమ్మకానికి అంతే బాధ్యతగా పనిచేస్తానన్నారు. ఉద్యోగస్తులందరూ వారి తోటి పట్టభద్రులను కలిసి అత్యధిక మెజార్టీతో కూటమి గెలిచేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా జనసేన ఐటీ కోఆర్డినేటర్ రవికృష్ణ, పొన్నూరు నియోజకవర్గ జనసేన ఐటీ కోఆర్డినేటర్ మండలనేని రాజేష్, గుం టూరు ఈస్ట్ నియోజవర్గం జనసేన ఐటీ కోఆర్డినేటర్ రవితేజ, గుం టూరు వెస్ట్ నియోజవర్గం జనసేన ఐటీ కోఆర్డినేటర్ సాయికుమార్, వేమూరు నియోజకవర్గం జనసేన ఐటీ కోఆర్డినేటర్ మురళీకృష్ణ, తెనాలి నియోజవర్గ ఐటీ కోఆర్డినేటర్ సునీల్‌కుమార్ పలువురు కూటమిశ్రేణులు పాల్గొన్నారు.

● పట్టణంలోని గౌతమ్ గ్రాండ్ హోటల్లో ఎమ్మెల్సీగా ఆలపాటి రాజేంద్రప్రసాద్ గెలుపును కాంక్షిస్తూ శనివారం ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు ఉన్నం ధర్మారావు మాదిగ విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న మంచి వ్యక్తి ఆలపాటి రాజేంద్రప్రసాద్ అన్నారు. అటువంటి వ్యక్తిని ఎమ్మెల్సీగా గెలిపించుకుంటే అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. పట్టభద్రులందరూ ఆలపాటికి ప్రధమప్రాధాన్య ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

● ఆల్‌పీపుల్స్ పార్టీ ఆధ్వర్యంలో కృష్ణా, గుంటూరు ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థిగా పోటీచేస్తున్న ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను గెలిపించాలని కోరుతూ ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు బొమ్మసాని ముత్యాలరావు ప్రచారం నిర్వహించారు. పట్టణంలోని చెంచుపేటలో యూనిహోం అపార్ట్‌మెంట్‌లోని పట్టభద్రులను కలిసి ఆలపాటికి ప్రధమ ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కార్మూలు నరసింహారెడ్డి, బ్రహ్మయ్య, మల్లి చౌదరి, మురళి, లాజర్ తదితరులు పాల్గొన్నారు.

● సంగంజాగర్లమూడి గ్రామ కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఆలపాటికి వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరుతూ పట్టభద్రులను కలిసి కరపత్రాలు అందించారు. కూటమి నాయకులు కొత్త రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

ఆలపాటిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలి

కొల్లిపర, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థిగా పోటీచేస్తు న్న ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని దుగ్గిరా ల మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ వంగా సాంబిరెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని వల్లభాపురం, కొల్లిపర, తూములూరు తదితర గ్రామాల్లో టీడీపీ నేతలతో కలిసి ఆయన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. పట్టభద్రులను కలిసి కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు భీమవరపు చినకోటిరెడ్డి, టీడీపీ జిల్లా కార్యదర్శి కంచర్ల అమృతరాజు, నీటి సంఘ అధ్యక్షుడు బొట్టా శ్రీరాములరెడ్డి, నీటిసంఘ ఉపాధ్యక్షుడు ఆరిమండ శివనాగమల్లేశ్వరరెడ్డి, టీడీపీ నాయకులు గుదిబండి గోవర్ధనరెడ్డి, భీమవరపు లంకకోటిరెడ్డి, జంగా శ్రీనివాసరెడ్డి, కొల్లి కోటిరెడ్డి, బొంతు చంద్రిక, షేక్ రఫీ, చాగంటి నారాయణరెడ్డి పాల్గొన్నారు.

ప్రజ్ఞానంద సరస్వతిని కలిసిన ఆర్యవైశ్య సంఘీయులు



బాలస్వామి ఆశీస్సులు పొందిన పట్టణ ఆర్యవైశ్య సంఘ సభ్యులు

తెనాలి, మారీసుపేట, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక గంగానమ్మపేటలోని సాలిగ్రామ మఠంలో శనివారం పెనుగొండ క్షేత్ర పీఠాధిపతి ప్రజ్ఞానంద సరస్వతి (బాలస్వామి)ని పట్టణ శ్రీవాసవీ సేవా సమితి, శ్రీవాసవి విద్యానిధి కమిటీ, కమీషన్ మర్చంట్స్ అసోసియేషన్ సభ్యులు కలిసి ఆశీస్సులను పొందారు. ఈ సందర్భంగా బాలస్వామి ప్రవచనం చేస్తు అమ్మవారి విశిష్టతలను, క్షేత్రమహిమను తెలిపారు. ముందుగా బాలస్వామికి సంఘ సభ్యులు నూతన పట్టు వస్త్రములను అందించి ఆశీస్సులు పొందారు. కార్యక్రమంలో పట్టణ పురపాలక సంఘ మాజీ ఛైర్మన్ పెండేల వెంకట్రావు, పెండేల సుబ్బారావు, సామి రమేష్, యక్కల శ్రీరామన్నారాయణ, సుగ్గల వెంకటప్పయ్య, గుప్తా తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ విభాగం సేవలు అవసరం

● ఏఎన్‌యూ ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ ఆచార్య సింహాచలం



ప్రసంగిస్తున్న ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ ఆచార్య సింహాచలం

పెదకాకాని, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ప్రకృతి రమణీయతను పెంపొందించడంలో పర్యావరణ విభాగం సేవలు, సూచనలు, సలహాలు ఎంతో అవసరమని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ ఆచార్య జి. సింహాచలం అన్నారు. పర్యావరణ విభాగం ఆధ్వర్యంలో వర్సిటీలో రెండు రోజులుగా జరుగుతున్న జాతీయ సదస్సు ముగింపు కార్యక్రమం శనివారం జరిగింది. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఆచార్య సింహాచలం మాట్లాడుతూ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్సిటీలో పర్యావరణ సమతుల్యత దెబ్బతినకుండా పిచ్చుకల వంటి పర్యావరణానికి మేలు చేసే చిన్నచిన్న పక్షులను ఆకర్షించే విధంగా వర్సిటీని రూపొందించడంలో పర్యావరణ విభాగ ఆచార్యులు తగిన పరిశోధనాత్మక సలహాలను అందించాలని కోరారు. రెండు రోజులుగా దేశం నలుమూలల నుంచి ఎంతో మంది పర్యావరణహితులు ఈ సదస్సులో పాల్గొనటం అభినందనీయమని కొనియాడారు. ఈ సందర్భంగా ఆచార్యులు ఏవీవీఎస్ స్వామి, పి.బ్రహ్మాజీలతో పాటు అతిథి అధ్యాపకులు డాక్టర్ వి.సుభాషిని, డాక్టర్ సీహెచ్ సునీత, డాక్టర్ కె.శశిధర్‌లను అభినందించారు. అనంతరం పరిశోధక పత్రాలను సమర్పించిన విద్యార్థులకు ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఈ సదస్సులో విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

లక్ష్మణరావుకి మద్దతుగా ప్రచారం

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావు విజయం కోరుతూ శనివారం రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి ఆధ్వర్యంలో రైతు సంఘం నేతలు పట్టణంలోని పలు దుకాణాలలో వ్యాపారులను కలిసి ఓట్లు అభ్యర్థించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు పెంచేది లేదని చెప్పిన మాటలు ఆచరణలో లేవన్నారు. స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించిన వారే అధికారంలోకి రాగానే వాటిని ఏర్పాటు చేస్తున్నారని విమర్శించారు.

బంగారం షాపులో చోరీకి యత్నం

తెనాలి క్రైం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని షరాఫ్ బజారు ప్రాంతంలో కొత్తమాసు జనార్ధన్ బంగారు షాపులో శుక్రవారం అర్ధరాత్రి చోరీ యత్నం జరిగిందని వన్ టౌన్ ఎస్ఐ సుబ్బయ్య తెలిపారు. దుండగులు బంగారు షాపు వెనుక భాగం నుంచి షట్టర్లు తొలగించడానికి ప్రయత్నిస్తున్న సమయంలో నైట్ వాచ్‌మెన్ గుర్తించడంతో, దుండగులు పరారయ్యారన్నారు. ఈ సంఘటనపై షాపు యజమాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

స్కౌట్ శిక్షణతో క్రమశిక్షణ, సేవాభావం

పొన్నూరుటౌన్ (చేబ్రోలు): ఫిబ్రవరి 22: స్కౌట్ అండ్ గైడ్స్ శిక్షణతో సేవాభావం, క్రమశిక్షణ అలవరుతాయని భారత స్కౌట్ అండ్ గైడ్స్ జిల్లా కార్యదర్శి ఎం ఏడుకొండలు అన్నారు. మండల పరిధిలోని నారాకోడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం వరల్డ్ థింకింగ్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా స్కౌట్స్ ఉద్యమ రూపకర్త బాడెన్ పావెల్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో స్కౌట్ ఉపాధ్యాయులు సీహెచ్ నాగేశ్వరరావు, మాధవిలత, తదితరులు పాల్గొన్నారు.



బాడెన్‌పావెల్ చిత్ర పటానికి నివాళులు అర్పిస్తున్న స్కౌట్ విద్యార్థులు



ట్రాఫిక్ సిగ్నల్ బోర్డుల ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీఎస్పీ జనార్ధనరావు, సీఐ రమేష్‌బాబు తదితరులు

ప్రణాళికాబద్ధంగా ట్రాఫిక్ నియంత్రణ

● డీఎస్పీ జనార్ధనరావు

తెనాలి మారీసుపేట, ఫిబ్రవరి22 (ఆంధ్రజ్యోతి): తెనాలిలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి ప్రణాళికాబద్ధమైన చర్యలు తీసుకుంటున్నట్లు డీఎస్పీ జనార్ధనరావు తెలిపారు. శనివారం స్థానిక మార్కెట్ వంతెన వద్ద దాత నటరాజ్ జుయలర్స్ అధినేత కొత్తమాసు కుమార్ సహకారంతో ఏర్పాటు చేసిన ఐరన్ బోర్డులను డీఎస్పీ పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ పట్టణంలో ట్రాఫిక్ సమస్య పరిష్కరించే దిశగా ఐరన్ సైన్ బోర్డులు ఏర్పాట చేస్తున్నట్లు తెలిపారు. ఆయన వెంట త్రీటౌన్ సీఐ రమేష్‌బాబు, ఎస్సై ప్రకాష్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాగళం వినిపించేది పీడీఎఫ్ ఎమ్మెల్సీలే...

● ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి



మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): శాసనమండలిలో పట్టభద్రుల సమస్యలపై గళం వినిపించేది పీడీఎఫ్ ఎమ్మెల్సీలేనని ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి అన్నారు. ఈ నెల 27న జరగనున్న కృష్ణా గుంటూరు శాసన మండలి గ్రాడ్యుయేట్ నియోజకవర్గ ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం ఆమె చెంచుపేట ప్రజా సంఘాల కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. పీడీఎఫ్ అభ్యర్థి కెఎస్ లక్ష్మణరావు ఎన్నో ఏళ్లుగా సమస్యలపై మండలిలో ప్రజాగళాన్నివినిపిస్తున్నారన్నారు. నిస్వార్థంగా ప్రజాసేవకు అంకితమైన లక్ష్మణరావుకి ఓటు వేసి గెలిపించాలని పట్టభద్రులను కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు భావన్నారాయణ, బాబుప్రసాద్ పాల్గొన్నారు.

బీసీ కార్పొరేషన్‌లకు నిధులు కేటాయించాలి

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టనున్న బడ్జెట్‌లో బీసీ కార్పొరేషన్‌లకు నిధులు కేటాయించాలని రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు కోరారు. శనివారం తెనాలిలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. బీసీల జనాభా మేరకు దామాషా ప్రకారం నిధులు మంజూరు చేయాలన్నారు. ఎన్నికల మ్యానిఫెస్టోలో చెప్పిన విధంగా ఏడాదికి రూ.30 వేల కోట్లు వంతున ఈ ఐదేళ్లలో రూ.1.5 లక్షల కోట్లు బీసీ మంత్రిత్వ శాఖకు కేటాయించాలన్నారు. స్వయం ఉపాధి, ఆదరణ పథకానికి నిధులు అందించాలని, అన్ని జిల్లాల్లో వృత్తి పని వారందరికి వర్క్‌షాపులు ఏర్పాటు చేయాలని కోరారు. రాయితీలపై గొర్రెల పెంపకందారులకు గొర్రెల యూనిట్లు, చేనేత ఉత్పత్తులపై జీఎస్టీ లేకుండా పవర్ లూమ్స్ ఏర్పాటు, ఉచిత విద్యుత్ అందించాలన్నారు. నాయీ బ్రాహ్మణులకు గౌరవ వేతనం, షాపులకు ఉచిత విద్యుత్, దోబీఘాట్ల నిర్మాణం, స్వర్ణ కార ఫైనాన్స్ కార్పొరేషన్లలకు ప్రణాళిక రూపొందించాలన్నారు.

పద్మశ్రీ నాజర్‌కు ఘన నివాళి



పద్మశ్రీ నాజర్‌కు నివాళులు అర్పిస్తున్న సీపీఐ నాయకులు

పొన్నూరుటౌన్; ఫిబ్రవరి 22: బుర్ర కథ ద్వారా ప్రజలను చైతన్య వంతులు చేసిన మహనీయుడు నాజర్ అని ఆంధ్రప్రదేశ్ ప్రజా నాట్యమండలి జిల్లా కార్యదర్శి ఆరేటి రామారావు అన్నారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో శనివారం బుర్ర కథ పితామహుడు పద్మశ్రీ నాజర్ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. గుంటూరు జిల్లాలోని పొన్నెకల్లు గ్రామంలో పేద కుటుంబంలో పుట్టిన నాజర్ జీవిత చరిత్రను మననం చేసుకున్నారు. నాజర్ బుర్రకథా విశేషాలను వివరించారు. ఈ సందర్భంగా నాజర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో కళాకారులు సురేష్, నరసింహారావు, టైలరింగ్ యూనియన్ అధ్యక్షుడు ఎస్కే బాబు, తదితరులు పాల్గొన్నారు.

ఈకేవైసీ పూర్తిచేయాలి



డీలర్ల సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ జియావుల్ హక్

పొన్నూరుటౌన్; ఫిబ్రవరి 22: రేషన్ కార్డుల ఈకేవైసీ ఈ నెలాఖరులోపు పూర్తి చేయాలని తహసీల్దార్ జియావుల్ హక్ ఆదేశించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శనివారం రేషన్ పంపిణీపై ఆయన సమీక్ష నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ డీలర్‌లు ఆథరైజేషన్ రెన్యూవల్ క్రమం తప్పకుండా చేయించుకోవాలని సూచించారు. నిత్యావసర వస్తువుల పంపిణీలో అవకతవకలకు పాల్పడేవారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో రేషన్ డీలర్‌లు, ఎండీయు ఆపరేటర్‌లు, వీఆర్వోలు, తదితరులు పాల్గొన్నారు.